

ముదినేపల్లి మండలం చినపాలపర్రులో నేలమట్టమైన వరి పైరు

అకాల వర్షాలతో రైతాంగం ఆందోళన

ఏలూరుసిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. కోస్తా ప్రాంతంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తగ్గట్టుగానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం ఏర్పడి జిల్లా అంతటా నానుడు వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా నిల్వ చేసిన ధాన్యంలో తేమ శాతం పెరిగే అవకాశం ఉందని, రహదారులపై ఆరబెట్టిన ధాన్యానికి బరకాలు కప్పినా ధాన్యం తడిసిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరాలు సాగు చేసిన రైతులతో పాటు ఆక్వా రైతులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. మామిడి తోటలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఉత్తరకోస్తా ప్రాంతంలో ఈనెల 23, 24 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా చాత్రాయి మండలంలో 8.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగిరిపల్లిలో 2.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన ఏడు మండలాల్లో రెండు మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో చలిగాలుల తీవ్రత విపరీతంగా పెరిగింది. గంటకు 22 కిలోమీటర్ల వేగంతో చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి ఉష్ణోగ్రతల్లో మార్పు వచ్చింది. పగటి ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెంటీగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత సుమారు 21 డిగ్రీలు నమోదైంది.

పెట్టెలో మృతదేహం.. డోర్ డెలివరీ!



మృతదేహం డోర్ డెలివరీ అయిన ఇంటి వద్ద విచారణ చేపట్టిన పోలీసులు



యండగండిలో కేసు విచారిస్తున్న జిల్లా ఎస్పీ నయీం అస్మి

యండగండిలో కలకలం

నేర చరిత్రలో వింత ఘటన.. పోలీసులకు సవాల్ విసిరిన సంఘటన. ఇంటి సామగ్రి వచ్చిందనుకుని పెట్టెను తెరిస్తే కుళ్లిన మృతదేహం బయటపడడం కలకలం రేపింది. ఉండి మండలం యండగండిలో గురువారం సాయంత్రం వెలుగు చూసిన ఈ ఘటన శుక్రవారం వేకువజామునే రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయ్యింది. సాగి తులసి ఇంటికి వచ్చిన ఆ మృతదేహం ఎవరిది ? ఆటో డ్రైవర్ ఎవరు ? దీనిని ఎక్కడి నుంచి ? ఇక్కడికే ఎందుకు తెచ్చారు ? ఎవరు పంపించారు ? కోటీ 30 లక్షలు చెల్లించకుంటే ఇబ్బందులు తప్పవని లేఖ ఎవరు ఎవరికి రాశారు ? తులసి భర్త ఎక్కడ వున్నారు ? వారు ఎందుకు విడిపోయారు ? తులసి, తండ్రి గంగరాజు, సోదరి రేవతి, మరిది సిద్దార్థవర్మలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరి మధ్య గొడవలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది ? నిజమేనా ? మధ్యలో క్షత్రియ పరిషత్, సేవా సమితిల పేర్లు ఎందుకు వచ్చాయి ? ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెలియాల్సి వుంది. వీటిలో దేనికీ పోలీసులు మీడియాకు సమాచారం ఇవ్వడం లేదు. గుట్టుగా విచారణ సాగిస్తూ నిందితుల కోసం జల్లెడ పడుతున్నారు.

ప్రధాన వార్త మెయిన్‌లో..

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా : ఎస్పీ



ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిబ్బందికి ఉన్న ఇబ్బందులను తొలగించడా నికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోలీస్, ఏఆర్, హోంగార్డుల నుంచి వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ పండుగ సేవలు

- 25వ తేదీ నుంచి వచ్చేనెల 19వ తేదీ వరకు కార్గో డోర్ డెలివరీ
- కేజీ నుంచి 50 కేజీల వరకు 10 కిలోమీటర్ల దూరంలోపు ఉచితంగానే అందజేత
- సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక బస్సులు
- రాను పోను టిక్కెట్ రిజర్వేషన్ చేసుకుంటే పది శాతం రాయితీ
- ఎలాంటి అదనపు ఛార్జీలు లేవు : డీపీటీవో వరప్రసాద్ వెల్లడి



ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాన్ని ఈనెల 25వ తేదీ నుంచి వచ్చేనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ చెప్పారు. ఏలూరులోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏటా డిసెంబరులో ప్రయాణికులు క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలతో పాటు ఆత్మీయతను అందించేలా కొన్ని ఆహార పదార్థాలు అందించుకుంటారు. వీటిని వారి అభిమానానికి తగినట్టుగా డోర్ డెలివరీ అందించడానికి మక్కువ చూపుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ కార్గో ద్వారా ఈనెల 25వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు ఒక కేజీ నుంచి 50 కేజీల వరకు ఒక కిలో మీటర్ నుంచి 10 కిలోమీటర్ల వరకు ఉచిత డోర్ డెలివరీ చేయనున్నాం. అయితే బుకింగ్ సమయంలోనే డోర్ డెలివరీ అని స్పష్టంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సంక్రాంతి సంబరాలకు హైదరాబాద్, బెంగళూరు, విశాఖ ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉభయ గోదావరి జిల్లా వాసులు తమ సొంత గ్రామాలకు వచ్చేందుకు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నాం. హైదరాబాద్ నుంచి, ఇతర ప్రాంతాల నుంచి జనవరి 9వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు 117 బస్సులను ఏర్పాటు చేశాం. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ ప్రారంభించాం. జనవరి 15వ తేదీ నుంచి జనవరి 20 వరకు జిల్లా నుంచి హైదరాబాద్ తిరుగు ప్రయాణానికి 93 బస్సులను ఏర్పాటు చేశాం. ప్రయాణికుల రద్దీ బట్టి బస్సుల సంఖ్యలను పెంచుతాం. ఒకేసారి రానుపోను టిక్కెట్లను రిజర్వేషన్ చేయించుకుంటే వారికి పది శాతం చొప్పున సౌకర్యంలో రాయితీ లభిస్తుంది. ఈప్రయాణానికి అదనపు ఛార్జీలు లేవు. కారుణ్య నియామకం కింద ఎంపికైన తొమ్మిది మందికి త్వరలో ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తా'మన్నారు. సమావేశంలో ఏలూరు డిపో మేనేజర్ వాణి, కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, పీఆర్వో నరసింహం పాల్గొన్నారు.

తవ్వినకొద్దీ డొల్ల

ఊరూవాడా కబ్జాల పర్వం

- గడిచిన ఐదేళ్లు బరి తెగించిన వైసీపీ అనుకూలురు
- ఎక్కడికక్కడ అక్రమ రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ సదస్సుల్లో బయట పడుతున్న భూబాగోతాలు
- నిగ్గు తేలిస్తేనే బాధితులకు న్యాయం..
- ఆ దిశగా ప్రభుత్వం అడుగులు

జిల్లా ఏ ఊరిలో ఎవరిని కదిపినా భూ సమస్యలే. రీ సర్వే వివాదాలే. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ వివాదాలు చెప్పనక్కర్లేదు. భూకబ్జాదా రులు ఎక్కడికక్కడ చెలరేగి పోయారు. 22-ఏ పరిధిలోకి వచ్చే భూముల వ్యవహారంతో విసుగెత్తిన జనం బాధ అంతా ఇంతా కాదు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు జనం పోటెత్తుతున్నారు. ఇప్పటికే మూడో వంతు గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా రెండున్నర వేలకు పైగా అర్జీలు వచ్చాయి. వచ్చే నెల మొదటి వారం వరకు ఊరూరా అర్జీలు స్వీకరించి ఆ తదుపరి వచ్చే 45 రోజుల్లో పరిష్కారానికి శ్రీకారం చుడతారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొన్నేళ్లుగా భూవివాదాలు పేరుకుపోయాయి. స్థానిక రాజకీయాలను అడ్డుపెట్టుకుని గత వైసీపీ పాలనలో కొందరు రెచ్చిపోయారు. తమ మాటే చెల్లేలా జులుం ప్రదర్శించారు. ఆఖరుకి జిల్లాస్థాయిలో ప్రతీ సోమవారం జరిగే పరిష్కార వేదిక వద్దకు చేరనీయకుండా చేశారు. ఒకవేళ వెళ్లినా ఏదో రూపంలో వారందరినీ మాయ చేశారు. సరిహద్దులున్నా హద్దులు చెరిపేసి కబ్జా చేసి ఆ భూమి నాదేనంటూ రౌడీయిజం చేశారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా 665 రెవెన్యూ గ్రామాలు ఉండగా వీటిలో ఇప్పటికే 254 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇప్పటి వరకు వీటన్నింటిలోనూ దాదాపు 2,729కి పైగా అర్జీలు వచ్చాయి. వీటిలో 527 అర్జీలను పరిష్కరించారు. ఇవన్నీ చిన్నాచితక సమస్యలే. కేవలం మండల స్థాయిలో అప్పటి అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గినవే. పరిష్కారం నిమిత్తం మండల అధికారులను ఆశ్రయించినా అప్పట్లో న్యాయం జరగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూకబ్జాలకు పాల్పడితే జైలేనంటూ హెచ్చరించింది. ఇప్పటికే సాగిన భూదందాలను గుర్తించి ఆ మేరకు పేదలకు న్యాయం చేసేందుకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు దిగింది. ఏ ఊరిలో సదస్సు నిర్వహించినా అక్కడ భూతగాదాలు, సమస్యలే. స్థానికంగా కొందరు పనిగట్టుకుని రాజకీయం చేసి ఎదుట పక్షాన్ని దెబ్బ తీసేలా అడ్డంకులు సృష్టించిన వివాదాలే. చింతలపూడి, నూజివీడు, కైకలూరు, ఏలూరు పరిధిలో ఈ తరహా అనేక సమస్యలు అర్జీల రూపంలో బయట పడుతున్నాయి.

బరితెగించి చెలగాటం

పేదలు లేదా ఎదుట పక్షం అనుకూలురైతే చాలు స్థానిక వైసీపీ నేతలు గ్రామాల్లో చెలరేగిపోయారు. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల అక్రమ రిజిస్ట్రేషన్లకు తావిచ్చినట్టు ఫిర్యాదులు అందాయి. అగ్రిమెంట్‌తో సంబంధం లేకుండా అది రాసుకున్నట్టుగా బోగస్ పత్రాలు సృష్టించి వ్యవహారాలను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అప్పట్లో రీసర్వే కింద హద్దులు పాతగా కొందరేమో బరితెగించి హద్దు రాళ్లను తొలగించి భూ ఆక్రమణలకు పాల్పడినట్టు ఫిర్యాదులతో స్పష్టమవుతోంది. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా అప్పట్లో ఏ చర్యలు తీసుకోలేదు. రీసర్వే జరిగిన ప్రాంతాల్లో ఇంతకుముందే టాగింగ్ పూర్తి చేసినందున హద్దులెక్కడికి పోవని, భద్రంగా రికార్డు చేసి ఉందని రెవెన్యూ అధికారులు ఇప్పటికీ చెబుతున్నా సర్వేయర్లు రంగంలోకి దిగలేకపోతున్నారు. ఈ తరహా పరిస్థితులపైనా రెవెన్యూ సదస్సుల్లో కొందరు ఫిర్యాదులు చేశారు. రిజిస్ట్రేషన్లు కానీయకుండా ఎల్‌పి నెంబర్లను రెండు సర్వే నెంబర్లకు కలిపి ఒకటే ఉండడంతో అనేక సమస్యలు తలెత్తాయి. తీరా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరేసరికి అసలు విషయం బట్టబయలవుతోంది. 22-ఏ పరిధిలో కొన్ని భూములకు మినహాయింపులు ఇచ్చారు. ఇదే అదనుగా ఆక్రమణ పర్వం వైసీపీ అనుకూలురుదే సాగింది. అన్ని గ్రామాల్లోనూ ఈ తరహా భూమి 1100 ఎకరాలకు పైగానే ఉంటుంది. ప్రభుత్వ పోరంబోకు స్థలాలను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వైనం బయటపడుతోంది. ఏలూరు శివారులో ఈ తరహా ఫిర్యాదులున్నట్టు చెబుతున్నారు.

నిగ్గు తేల్చేందుకే సదస్సు

గత ఐదేళ్లు ఎడాపెడా సాగిన భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ సదస్సుల్లో బయట పడుతోంది. ప్రత్యేకించి గ్రామాల్లో ఖాళీ భూములను ఆక్రమించడం, లేదా అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వివాదాలెన్నో బయట పడుతున్నాయి. పంచాయతీల పరిధిలో ప్రభుత్వ భూమి ఖాళీగా ఉంటే ఆ భూమి కాస్తా వైసీపీ అనుకూలురు తమకు స్వాధీనం అయ్యేలా జాగ్రత్త పడ్డారు. అసైన్డ్ భూముల వ్యవహారం లెక్కకు మిక్కిలిగా ఉన్నట్టు చెబుతున్నారు. ఇవన్నీ వచ్చే మార్చినాటికల్లా అధికారులు పరిశీలన చేసి చర్యలకు దిగబోతున్నారు. తొలుత నెల పాటు అర్జీలు స్వీకరణ, ఆపై 45 రోజుల పాటు అర్జీల పరిష్కారానికి పరిశీలన, తగు రీతిలో స్పందనకు అధికారులకు ఆదేశాలు అందాయి.



కలిదిండి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

254 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ : జేసీ

ఏలూరుసిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటివరకు 254 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సుల్లో 1,456 మంది పాల్గొని ఆయా సమస్యలపై 307 అర్జీలను సమర్పించగా అప్పటికప్పుడే 77 అర్జీలు పరిష్కరించినట్టు తెలిపారు. అర్జీలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తారన్నారు. ఇప్పటివరకు 254 గ్రామ రెవెన్యూ సదస్సులకు 11,922 మంది హాజరై 2,729 అర్జీలు అందజేయగా 521 అర్జీలు పరిష్కరించి నట్టు తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు జరిగే సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించామన్నారు.


క్యాన్సర్ కోరలు..!

225 మందికి క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ.. మరో 1912 మందికి అనుమానిత లక్షణాలు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వైద్యసేవల విభాగం

ఏప్రిల్‌లోగా ఏరియా ఆస్పత్రుల్లో కీమోథెరఫీ సేవలు.. మరో ఆరు నెలలపాటు స్క్రీనింగ్ క్యాంపులు

ఇంటింటా సర్వేలో విస్తుపోయే నిజాలు..



జిల్లాలో క్యాన్సర్, జీవనశైలి వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 18 ఏళ్ళ వయసు నుంచే రోగాలు సోకుతున్నాయి. ఆరోగ్యశాఖ రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 14 నుంచి చేపట్టిన ఇంటింటా క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం స్క్రీనింగ్ క్యాంపులు ప్రారంభించిన తొలి విడతలోనే జిల్లాకు సంబంధించి ఆందోళనకర నివేదికలు ఒకింత భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

6

టీచర్ల పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతం

ఏలూరు నగరపాలకసంస్థ, ఏడు పురపాలక సంఘాల్లో 48మందికి ప్రమోషన్లు 7

వెబ్‌ల్యాండ్.. కష్టాలు!

- ఆరేళ్లుగా ఆపేసిన వెబ్‌ల్యాండ్
- అన్నివిధాలా నష్టపోతున్న రైతాంగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రెవెన్యూ గ్రామ సభల్లో రైతులు వినతి పత్రాలు

కుక్కునూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 2017 -18 సంవత్సరాల్లో దాదాపు 15 వేల ఎకరాల భూసేకరణ ప్రక్రియ జరిగింది. ఈ సమయంలో రైతులకు ఉన్న భూములకు సంబంధించి పహాణీల్లో పట్టాదారు, అనుభవదారు పేర్లు మార్చుతూ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో చేర్పులు, మార్పులు జరగడానికి వీలులేకుండా 2018లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు సంబంధించి రైతుల భూముల వివరాలు తెలిపే ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌ల్యాండ్‌ను మూసివేశారు. అనంతరం ముంపు భూముల భూసేకరణ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉన్నా వెబ్‌ల్యాండ్ మాత్రం ఓపెన్ చేయలేదు. మరోవైపు ముంపునకు గురికాని భూములు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఇంకా దాదాపు 10 వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు అంచనా. ఈ క్రమంలో వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆర్థికంగాను నష్టపోతున్నారు. తల్లిదండ్రులకు ఉన్న భూములను వారసత్వంగా కొడుకు, కూతుళ్ళకు ఇతరేతర కుటుంబ సభ్యులకు ఇచ్చి మ్యుటేషన్ కింద పహాణీల్లో నమోదు చేయించుకోవడానికి వీలుపడడం లేదు. అవసరాల నిమిత్తం రైతుల భూములు అమ్ముకోవడానికి కష్టంగా మారింది. రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో వారికి పంట రుణాలు, రైతుభరోసా, పీఎం కిసాన్, పంట ఇన్సూరెన్స్ వ్యవసాయ పని ముట్లకు రైతులకు సబ్సిడీ అందడం లేదు. పండ్లతోటలు, పామాయిల్ వంటి సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహం కరువైంది. వారం రోజులుగా కుక్కునూరు మండలంలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. భూములకు సంబంధించిన సమస్యలతో పాటు వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేయాలంటూ రైతులు వినతిపత్రాలు అందజేస్తున్నారు. సర్వేనెంబర్‌లో ఉన్న తప్పులు సరిచేయాలని తాము అనుభవిస్తున్న భూములకు పాస్‌బుక్‌లు అందించాలని రైతులు కోరుతున్నారు. అన్ని సమస్యలకు వెబ్‌ల్యాండ్ ఓపెన్ అయితేనే పరిష్కారం అవుతుంది. అధికారులు రైతుల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్నారే తప్ప సమస్య పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వెబ్‌ల్యాండ్ మాత్రమే నిలిచిపోయింది. పోలవరం ప్రాజెక్టుతో ముంపుకు గురవుతున్న ఏటపాక, కూనవరం, చిత్తూరు, వరరామచంద్రాపురం మండలాల్లో వెబ్‌ల్యాండ్ పని చేస్తున్నాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజన రైతులకు భూమికి భూమి కింద స్థానికంగానే భూములిచ్చారు. ఇంతవరకు ఆ భూములకు సరిహద్దులు చూపించలేదు. రైతుల పేరుతో పట్టాలు ఇంతవరకు ఇవ్వలేదు.

వెబ్‌ల్యాండ్‌ను ఓపెన్ చేయాలి



వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. వారసత్వంగా ఉన్న భూములు రికార్డుల్లో లేకపోవడంతో పంట రుణాలు, పథకాలు, సబ్సిడీలు ఏమి అందకుండా పోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మడకం వీరయ్య, గిరిజన రైతు, ఇసుకపాడు



కుక్కునూరు మండలంలో జరిగిన గ్రామసభలో వెబ్‌ల్యాండ్ సమస్యపై వినతిపత్రం అందజేస్తున్న రైతు

రిజిస్ట్రేషన్ భూములకు తప్పని సమస్య

కుక్కునూరు గ్రామ పరిధిలో రిజిస్ట్రేషన్ భూములున్నాయి. ఈ భూములకు 2014- 15 వరకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ప్రస్తుతం జంగారెడ్డిగూడెం సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి భూరికార్డులు బదిలీ జరిగాయి. అయితే వెబ్‌ల్యాండ్ మూసివేయడంతో రిజిస్ట్రేషన్ జాబితాలో కుక్కునూరు ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయాయి. వెబ్‌ల్యాండ్ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించినట్టు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు.



ఓల్డ్ ఈజ్ గోల్డ్..

కొత్తొక వింత.. పాతొక రోత.. ఇది నానుడి.. కానీ ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని కూడా అన్నారు.. ఇప్పుడంతా టెక్నాలజీపై నడుస్తున్న రోజుల్లో అంతా కొత్తగానే ఆలోచిస్తారు.. ఇదవరకు గ్రామాల్లోకి వెళితే అందమైన పెంకిటిళ్లు, అక్కడక్కడా మండువా ఇళ్లు, డాబాలు కనిపించేవి.. రాను రాను వాటి స్థానంలో అధునాతన హంగులతో బిల్డింగ్‌లు లేచాయి.. ఇదంతా ఎందుకు.. సూటిగా విషయంలోకి వస్తే ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న గూటాల గ్రామంలో గ్రామం నడిబొడ్డున ఉంది.. ఇది వందేళ్ల చరిత్ర కలిగిన మేడ.. దాని నిర్మాణంలో చూపిన కళా నైపుణ్యానికి ముచ్చట పడిన ఆ ఇంటి వారు దాన్ని అపురూపంగా చూసుకుంటున్నారు. రంగులు వేయించి పాత కట్టడానికి ఎలాంటి మరమ్మతులు లేకుండా తాతల నాటి నుంచి జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. కాంక్రీట్ లేని సున్నపు శ్లాబ్, టేకు కమ్మీలు, ఇనుప కమ్మీలు, కిటికీలు, గ్రిల్స్ , టేకు మెట్లు అన్నీ పాత కాలం నాటివే.. అవన్నీ కూడా నేటికీ చెక్కు చెదరకుండా ఉండడం విశేషం. ప్రతి ఏటా రంగులు వేసి అందంగా ఉంచుతున్నారు.. - పోలవరం

హరివిల్లు అందాలు

ఇంద్రధనుస్సు చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది.. టక్కున కళ్లు అటువైపు మళ్లుతాయి.. శుక్రవారం సాయం సంధ్యవేళ జీలుగుమిల్లి సమీపంలో ఆకాశంలో హరివిల్లు కనువిందు చేసింది. ఒక వైపుమబ్బులు.. మరోవైపు ఎండ.. ఈ మధ్యలో కనిపించిన రంగుల వలయాన్ని చూసి పలువురు తమ సెల్ ఫోన్‌లలో బంధించారు. రెండు ప్రాంతాల్లో ఇంద్రధనస్సు ఏర్పడి క్షణాల్లో మాయమైంది.

-జీలుగుమిల్లి



అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం 5వ రోజు పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జాము నుంచి ప్రధాన అర్చకులు కె.శ్రీనివాస ఆచార్యులు, పవన్ కుమార్, వెంకట కృష్ణమాచార్యులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు.టీటీడీ ప్రభంద ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. అనంతరం ఉదయం రేపాక సుధారాణి వీణా గానంతో ప్రభాత సేవ చేశారు. ఈవో సత్యనారాయణ శంకర్, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా డైలీ మార్కెట్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం లోనూ, స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, శంభన్న అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం లోనూ ప్రత్యేకంగా ధనుర్మాస పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అండాళ్ళమ్మ వారు



సైకిల్‌పై శ్రీశైలం బయలుదేరిన స్వాములు

గునుపూడి నుంచి శ్రీశైలం సైకిల్ యాత్ర

భీమవరం టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భీమవరం గునుపూడి ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులు బృందంగా ఏర్పడి మాలలు ధరించి, ప్రతి ఏటా సైకిల్‌పై యాత్రలు చేస్తుంటారు. ఒక్కొక్క సంవత్సరం, ఒక యాత్రగా షిరిడీ, వారణాసి, కోలకత్తా, శబరిమలై క్షేత్రాలను దర్శిస్తూ ఉంటారు. ఈ సంవత్సరం శ్రీశైలం బయలు దేరారు. ఈ సందర్భంగా యాత్రకు వెళుతున్న వారికి పండ్లు, అల్పాహారం ట్రావెలింగ్ కిట్లు సురేష్ స్టీల్ సెంటర్ యాజమాన్యం అందించారు. బోండా రాంబాబు, బహదూర్, పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీజీపీఎస్ రోవర్లు

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వేకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన నివేదికలను ఇచ్చేందుకు జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్ రోవర్స్) సేవలను పొందనున్నారు. భూముల సర్వే వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వ సర్వేయర్ల మీదనే ఆధారపడకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా సేవలను పొందవచ్చు. సర్వేకోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ సర్వేయర్లు రావడానికి నెలరోజులకు పైగా సమయం పడుతోంది. సర్వేయర్లపై పెనుభారం ఒకటైతే నిత్యం క్షేత్రస్థాయిలో తిరగాల్సి ఉంటుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నా కచ్చితత్వం ఉండదన్న అపోహలతో వారిని ఆశ్రయించడానికి చాలామంది సంకోచిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఎవరు నివేదిక ఇచ్చినా కచ్చితత్వంతోనే ఉంటాయి. శాటిలైట్ ఆధారంగా పనిచేసే డీజీపీఎస్ రోవర్లు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అస్త్రాలుగా మారాయి. డీజీపీఎస్ రోవర్ల ద్వారా టోపో సర్వే, కాంటూరు, రోడ్డు, కెనాల్, ఇంటిలేఫుట్ ప్లాట్ మార్కింగ్, ఫీల్డ్, సరిహద్దు, ఎలివేషన్స్ లెవెల్స్ నేలపై డ్రాయింగ్, మెరక మార్కింగ్ వంటి పనులు చేపడతారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్న నేపథ్యంలో భూములకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల మేరకు గ్రామాల్లో డీజీపీఎస్ రోవర్ ద్వారా సర్వేయర్లు సర్వేను నిర్వహిస్తున్నారు.



డీజీపీఎస్ రోవర్‌తో సర్వే

వాలీబాల్ ఇంటర్ యూనివర్శిటీ టీం ఎంపిక

పెదపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ వాలీబాల్ మహిళల ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ కం ఇంటర్ యూనివర్శిటి టీం ఎంపికలు శుక్రవారం జరిగాయి. సీఎస్‌టీఎస్ గవర్నమెంట్ కళాశాల (జంగారెడ్డిగూడెం), ఎస్.ఎస్.ఆర్ జి.సి.పి.ఈ. (గోపన్నపాలెం), సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల (ఏలూరు), సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల (వట్లూరు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాల్లో నిలిచారు. వీరికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.సరళ బహుమతులు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు జనవరిలో తమిళనాడులో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారు.



ద్వారకాతిరుమల సచివాలయం వద్ద మార్కింగ్ ఇస్తున్న అధికారులు

ద్వారకాతిరుమలలో రహదారి విస్తరణ పనులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో రహదారి విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారిపై శుక్రవారం మార్కింగ్‌లు ఇచ్చారు. రహదారికి ఇరువైపులా పలు ప్రాంతాల్లో మార్కింగ్‌లు ఇచ్చి విస్తరణ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గత కొద్దికాలంగా ప్రధాన రహదారి విస్తరణ పనులు కోర్టుల్లో స్టే ఉన్న కారణంగా నిలిచిపోయాయి. క్షేత్రంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ఈ విస్తరణ అవసరమని తలచి ముందుగా ఆర్‌అండ్‌ఈ రహదారిపై ఆక్రమణలను గుర్తిస్తూ మార్కింగ్‌లు ఇస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. అలాగే క్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్న ఆయన వివరించారు. పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్‌వో మహాలక్ష్మి, విలేజ్ సర్వేయర్ పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చేపట్టండి

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పవని మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.కనకమహాలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటలు పూమొగ్గ, పచ్చి పూతదశలో ఉన్నాయన్నారు. మోస్తరు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికం అయ్యే అవకాశం ఉందని పూమొగ్గ దశలో ఉన్న తోటల్లో తేనెమంచు, పక్షికన్ను, బూడిద తెగుళ్ల నివారణకు ఇమిడిక్లోప్రిడ్ 0.3 ఎమ్ఎల్, క్లోరోథలోనిల్ 2 ఎమ్ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పచ్చి పూత దశలో ఉంటే థయోమిథాక్సిన్ 0.3 గ్రాములు లేదా కార్బండిజం మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తోటలకు నీరు అందించడం నిలిపివేయాలని ఆమె సూచించారు.



ఇంటింటి సర్వేలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

క్యాన్సర్ కోరలు..!

ఏలూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్యాన్సర్, జీవనశైలి వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 18 ఏళ్ళ వయసు నుంచే రోగాలు సోకుతున్నాయి. అశ్రద్ధ వహిస్తుండటంతో అంతకంతకూ ముదిరిపోతున్నాయి. క్యాన్సర్, బీపీ, మధు మేహం వ్యాధులను ఆదిలోనే గుర్తించి, వాటికి సరైన వైద్యచికిత్సలు, అవగాహనలతో కొంత వరకైనా నియంత్రించాలనే సంకల్పంతో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 14 నుంచి చేపట్టిన ఇంటింటా క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం స్ర్కీనింగ్ క్యాంపులు ప్రారంభించిన తొలి విడతలోనే జిల్లాకు సంబంధించి ఆందోళనకర నివేదికలు ఒకింత భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రమాదకర వ్యాధుల తీవ్రత, జిల్లాలో నియంత్రణ చర్యలపై ఓ పరిశీలన.

- ఇంటింటా సర్వేలో విస్తుపోయే నిజాలు
- ప్రతి ఇంట్లోనూ బీపీ, షుగర్ కేసులు
- కొత్తగా 35 వేలు దాటేసిన రక్తపోటు
- 27 వేలమందికి పైగానే తీపిజబ్బు
- 225 మందికి క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ
- మరో 1912 మందికి అనుమానిత లక్షణాలు
- ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వైద్యసేవల విభాగం
- ఏప్రిల్‌లోగా ఏరియా ఆస్పత్రుల్లో కీమోథెరపీ వైద్యసేవలు
- మరో ఆరు నెలలపాటు స్ర్కీనింగ్ క్యాంపులు

సర్వేలో ఆందోళనకర వాస్తవాలు

జిల్లావ్యాప్తంగా గతనెల 14 నుంచి అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో ప్రతీ ఇంటిని సందర్శించి 18 ఏళ్ళ వయసుపైబడిన యువతులు, మహిళలు, పురుషులకు ఆరోగ్య పరీక్షలను చేయడానికి ఒక్కో సచివాలయానికి ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లతో కూడిన మొత్తం 605 బృందాలను నియమించారు. ఈ బృందాలు సంబంధిత సచివాలయ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి నిర్దేశిత వయసుగల వారిని ప్రాథమికంగా పరీక్షించి మూడు రకాల క్యాన్సర్ లక్షణాలు, బీపీ, షుగర్‌లతో బాధపడుతున్న వారిని గుర్తిస్తాయి. ఇందుకుగాను ఈ బృందాలకు ముందుగానే శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఈ బృందాల నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం వరకు సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించగా, ఆందోళనకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో 18 సంవత్సరాల వయసు నిండిన జనాభా 16,74,079 మంది కాగా, వీరిలో శుక్రవారం వరకు 2,02,445 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్దేశిత వ్యాధులపై చేశారు. క్రోడీకరించిన గణాంకాల ప్రకారం జిల్లాలో అధిక రక్తపోటుతో 35,359 మంది బాధపడుతున్నట్టు నిర్ధారణకాగా, మరో 23,421 మంది అనుమానిత లక్షణాలతో ఉన్నట్టు గుర్తించారు. మధుమేహ వ్యాధి 27,662 మందికి కన్ఫర్మ్ కాగా, మరో 29,350 మందికి తీపిజబ్బు అనుమానిత లక్షణాలున్నట్టు తేల్చారు. ఇక సమాజంలో వేగంగా విస్తరిస్తోన్న క్యాన్సర్ రోగ నిర్ధారణ ప్రాథమిక పరీక్షలతో కొత్తరోగులు వెలుగులోకి వస్తున్నారు. వాస్తవానికి వైద్యఆరోగ్యశాఖ క్షేత్రస్థాయిలో చేపట్టిన స్ర్కీనింగ్ టెస్టులతోనే కొత్తకేసులు బయటకు వస్తున్నట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రకారం పొగాకు ఉత్పత్తులు నమలడం, ధూమపానం, తదితర కారణాలతో నోటిలో సంభవించే అల్సర్ల వల్ల సోకే ఓరల్ క్యాన్సర్ జిల్లాలో 45 మందికి నిర్ధారణకాగా, మరో 693 మందికి అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించి తదుపరి నిర్ధారణ పరీక్షలకు సిఫారసు చేశారు. కుటుంబ చరిత్ర, బహుళ వ్యక్తులతో అనైతిక లైంగిక సంబంధాలు, అరక్షిత లైంగిక సంపర్కం, సుఖవ్యాధుల వైరస్‌ల కారణంగా ఏర్పడే గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ జిల్లాలో 77 మందికి సోకినట్టు ప్రాథమిక పరీక్షల్లో నిర్ధారణ కాగా, మరో 641 మంది ఇంచుమించుగా అవే లక్షణాలతో ఉన్నట్టు అనుమానితుల జాబితాలో చేర్చారు. ఆలస్యపు వివాహాలు, తదితర కారణాలతో పుట్టినబిడ్డకు తల్లిపాలు ఆలస్యంగా ఇవ్వడం, కుటుంబచరిత్ర, రొమ్ముల పరిమాణంలో మార్పులు, రసాయనాల ప్రభావం వున్న జంక్‌ఫుడ్ భుజించడం తదితర కారణాలతో సంభవించే రొమ్ము(బ్రెస్ట్)క్యాన్సర్ 103 మంది మహిళలకు నిర్ధారణకాగా, మరో 578 మందికి అనుమానిత లక్షణాలున్నట్టు తేల్చారు. ఈ గణాంకాలన్నీ నెలరోజుల స్ర్కీనింగ్ క్యాంపుల నివేదికలు కాగా, ఇంకా ఆరు నెలలపాటు ఈ ఆరోగ్య పరీక్షలు ఇంటింటా జరగాల్సి ఉంది.

వచ్చేవారం నుంచే తుది నిర్ధారణ, వైద్య చికిత్సలకు ఏర్పాట్లు

ఊహించనంతగా క్యాన్సర్ కేసులు వెలుగులోకి వస్తుండటంతో ఇప్పటికే ప్రాథమిక పరీక్షల్లో రోగనిర్ధారణ జరిగినవారితో పాటు, అనుమానిత లక్షణాలున్నవారికి వైద్యనిపుణులతో తుదిపరీక్షలు నిర్వహించి నిర్ధారించుకునేందుకు వారం రోజుల వ్యవధిలోనే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఇందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా జోన్-2 పరిధిలో రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడలలోని జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రుల్లో క్యాన్సర్ రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్యచికిత్సల కోసం రూంనెంబరు 222తో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయి స్ర్కీనింగ్ క్యాంపుల్లో గుర్తించినవారికి పింక్‌కలర్ రిఫరల్ బుక్‌లను ఇచ్చి జిల్లా ఆస్పత్రులకు పంపిస్తారు. ప్రతీ మంగళ, గురువారాల్లో వీరందరికీ ప్రత్యేకరూం 222లో తుది రోగనిర్ధారణ పరీక్షలు, వైద్య చికిత్సల కోసం మూడురకాల క్యాన్సర్‌ల నిర్ధారణ నిమిత్తం ఒక సర్జికల్ అంకాలజిస్టు, ఒక డెంటిస్టు, ఒక గైనకాలజిస్టు అందుబాటులో ఉంటారు. వీరందరినీ సమన్వయపరిచేందుకు ఒక కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. గుర్తించిన రోగులనుంచి బయాప్సీని సేకరించి క్యాన్సర్ నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపిస్తారు. ల్యాబ్ నివేదిక మూడు నుంచి ఏడు రోజుల వ్యవధిలో వస్తుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనే బయాప్సీ నమూనాలను పరీక్షించేందుకు ల్యాబ్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వ్యాధి తీవ్రత, స్టేజ్‌నుబట్టి రోగికి అవసరమైన చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రి లేదా ఎన్టీఆర్ వైద్య చికిత్సకింద గుర్తించిన ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స ఇప్పిస్తారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లోగా జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లోనే డే కేర్ విధానంలో కీమోథెరపీ చికిత్సను స్థానికంగా అందించేందుకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు.


విద్యావంతులు ముందుకు రాకపోవడం విచారకరం



అన్ని సచివాలయాల పరిధిలో నియ మించిన స్ర్కీనింగ్ క్యాంపుల బృందాలు ప్రతీ ఇంటిని సందర్శించి నిర్దేశిత వయసు గ్రూపులోని వారందరి ఆరోగ్యవివరాలను నిర్ణీత యాప్‌లో నమోదుచేసిన తర్వాత, సంబంధిత వ్యక్తి వేలిముద్రను కూడా తీసుకుంటాయి. ఆ వెంటనే 'ఆయుష్మాన్ భారత్ హెల్త్ అష్యూరెన్స్' (అభా) ఐడీ నెంబరు క్రియేట్ అవుతుంది. భవిష్యత్తులో ఈ ఐడీతో సంబంధిత వ్యక్తి ఎక్కడైనా వైద్యం పొందవచ్చు. ఇప్పటివరకు జిల్లాలో జరిగిన స్ర్కీనింగ్ క్యాంపుల్లో గ్రామీణ ప్రాంత మహిళలు ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ టెస్టులకు సహకరిస్తుండగా, ముఖ్యపట్టణాలు, ఓ మాదిరి పట్టణప్రాంతాల్లో పలువురు విద్యావంతులైన మహిళలు గర్భాశయ ముఖద్వార పరీక్షలకు వెనుకంజ వేస్తున్నారు. దీనిపై మహిళల్లో అవగాహన కోసం ముందుగా సంబంధిత వ్యాధి లక్షణా లపై ముద్రించిన ఐఈసీ కరపత్రాలను వారికి అందజేసిన తర్వాతే స్ర్కీనింగ్ టెస్టు చేయాలని క్షేత్రస్థాయి బృందాలను ఆదేశించాం. ఇపుడున్న పరిస్థితుల్లో మహిళలు ప్రతీ ఆరునెలలకోసారి బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ టెస్టులు చేయించుకోవడం శ్రేయస్కరం. క్యాన్సర్‌ను ప్రాథమిక దశ అంటే స్టేజ్-1లోనే గుర్తిస్తే శరీరమంతా పాకకుండా సరైన వైద్య చికిత్సలతో బయటపడవచ్చు. అశ్రద్ధచేస్తే చికిత్సలకు రూ.లక్షల్లో ఖర్చులు, ఆర్థికసమస్యలతో పాటు, జీవితకాలం కూడా తగ్గిపోతుంది. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా స్ర్కీనింగ్ క్యాంపులకు స్థానికులు పాజిటివ్‌గా స్పందిస్తుండటం వల్లే కొత్తగా క్యాన్సర్ కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

- డాక్టర్ నరేంద్రకృష్ణ, జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్, అంటువ్యాధుల విభాగం (ఎన్‌సీడీ), వైద్య ఆరోగ్యశాఖ

అప్పుడే.. హౌస్‌ఫుల్



భీమవరం పట్టణంలో లాడ్జిలు, హోటల్స్ ఉన్న రోడ్డు

- భీమవరంలో లాడ్జిలు, హోటల్స్ బుక్
- ఈ ఏడాది భారీగా జూదాలు ఉంటాయని అంచనా
- రెండు నెలలు ముందుగానే రైలు రిజర్వేషన్
- మొదలైన సంక్రాంతి హడావుడి

భీమవరం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) నెలరోజులు ముందుగానే భీమవరం ,చుట్టు పక్కల గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది.. సంక్రాంతి అంటేనే ఈ ప్రాంత వాసులకు ముందుగా గుర్తు వచ్చేవి కోడిపందాలు, జూదాలు. దీంతో ఎక్కువ శాతం మంది పండుగ నాలుగు రోజులు ఈ ప్రాంతంలో గడపాలనే ఆశ పడతారు. ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, మద్రాస్, బెంగుళూరు, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పండుగకు తప్పనిసరిగా పుట్టిన ఊరులో ఆనందంగా గడిపేందుకు మక్కువ చూపిస్తుంటారు. దాని కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు ఖర్చు పెట్టి మరీ ఇక్కడకు వస్తుంటారు. దాని కోసం మూడు నెలలు ముందుగానే బస చేసేందుకు హోటల్స్ లాడ్జిలు బుక్ చేసుకుంటారు. ఎక్కువగా స్నేహితులను కూడా ఇక్కడకు తీసుకువచ్చి సరదాగా గడపాలనే ఆశతో వారికోసం హోటల్ రూములు బుక్ చేసుకుంటారు. దాంతోపాటుగా వాహనాల్లో వచ్చేవారిని మినహాయిస్తే రైళ్ళు బస్సుల్లో వచ్చేవారు నాలుగు నెలలు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడం ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తున్నది.



కోడిపందేలు మొదలెట్టేశారు

భీమవరం, ఉండి, నర్సాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో అప్పుడే సంక్రాంతి హడావుడి మొదలైంది. పోలీసుల కళ్ళుగప్పి కొన్ని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అలాగే బరుల వద్దే మద్యం కూడా ఏరులై పారుతోందని చెబుతున్నారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఈ ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం సంక్రాంతికి జూదాలకు పూర్తిస్థాయి అనుమతులు ఇస్తారని కొందరు చెప్పుకుంటున్నారు.

భీమవరంలో హోటల్స్ ఫుల్

రానున్న నెల రోజుల్లో సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇప్పటికే భీమవరంలోని హోటల్స్, లాడ్జిలు హౌస్ ఫుల్ అయిపోయాయి. ఆ నాలుగు రోజులు మాత్రం ఎటువంటి రూములు ఉండవని నిర్వాహకులు ముందుగానే చెబుతున్నారు. భీమవరంలోని వంటకాలకు దూరప్రాంత వాసులు మక్కువ చూపిస్తారు. అటువంటి వారి కోసం హోటల్స్ నిర్వాహకులు కొత్త రకమైన రుచులు వారికి అందించి సొమ్ము చేసుకోవాలని అలాగే ఆఫర్లు కూడా పెట్టి వ్యాపారంలో లాభం పొందాలని చూస్తున్నారు.

రైళ్లు, బస్సులు రిజర్వేషన్‌లు నిల్

వచ్చేనెలలో సంక్రాంతి పురస్కరించుకుని రైళ్ళు, బస్సులు రిజర్వేషన్లు ఇప్పటికే బుక్ చేసుకున్నారు. అప్పటికప్పుడు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా నాలుగు నెలల ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్లు బుక్ చేసుకున్నారు. సంక్రాంతికి వచ్చేవారు రిజర్వేషన్ లేకపోతే సొంత వాహనాల్లో వచ్చేస్తుంటారు..

బైండోవర్ కేసులు

సంక్రాంతి పురస్కరించుకుని గతంలో కోడి పందాలు, పేకాట, జూదాలు నిర్వాహకులపై ముందస్తుగా బైండోవర్ చేసి తహసీల్దార్ కోర్టులో హాజరుపరచి పూచీకత్తుపై వదులుతారు. కానీ యథావిధిగానే జూదగాళ్ళు జూదాలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది చివరి నుంచి బైండోవర్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

మందు కొంటే.. ముక్క ఫ్రీ

- వాటర్ ప్యాకెట్, గ్లాస్ కూడా
- తీర ప్రాంతంలో మద్యం వ్యాపారుల కొత్త ట్రెండ్..

నరసాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో మార్కెట్‌లో ఆఫర్ల జాతర సాగుతోంది, కస్టమర్లను ఆకర్షించేందుకు వ్యాపారులు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. అయితే వీరి తరహాలోనే మద్యం వ్యాపారులు కూడా మందుబాబుల్ని ఆకట్టుకునేందుకు కొత్త ప్రయోగం మొదలుపెట్టారు. సీసా కొంటే చాలు చికెన్ ముక్క ఫ్రీగా ఇస్తున్నారు, ఇదొక్కటే కాదు... గ్లాస్, వాటర్ ప్యాకెట్ కూడా ఉచితమే. కౌంటర్‌లో రూ.100 నిబ్బు కొనుగోలు చేసి పక్కకి వస్తే చాలు టేబుల్ మీద ముక్క గిన్నె రెడీగా ఉంటుంది. చిన్న డిస్పోజబుల్ గిన్నెలో మూడు చికెన్ ముక్కలతో పాటు గ్లాస్, వాటర్ ప్యాకెట్ అందిస్తున్నారు. గత రెండు రోజులుగా పట్టణంలోని ఓ మద్యం షాపులో ఈ ట్రెండ్ సాగుతోంది. అయితే ఇక్కడ ఉదయం ఉన్న నాన్‌వెజ్ సాయంత్రం ఉండదు. ఉదయం చికెన్ ముక్కలు ఇస్తే.... సాయంత్రం చిన్న చేపల ఫ్రై ఇస్తున్నారు. మరోసారి గుడ్డుఫ్రై, చేప ముక్క అందిస్తున్నారు. దీంతో మద్యం బాబులు దుకాణానికి క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మందు కొట్టాలంటే రూ.100లకు నిబ్బు వస్తుంది. దీనికి వాటర్, గ్లాస్, తినేందుకు స్టఫ్ ఉండాలి. దీనికి అదనంగా మరో రూ.50 అవసరం అవుతుంది. అయితే రూ.100 జేబులో ఉంటే చాలు స్టఫ్ ఫ్రీగా వస్తుండటంతో మందుబాబులు ఖుషీ అయిపోతున్నారు. ఇప్పటికే మద్యంబాబులు లక్షలు పెట్టి దుకాణాలు దక్కించుకున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వ్యాపారాలు సాగడం లేదు. మరోవైపు సెంటర్‌లో షాపు పెడదామంటే ప్రజల నుంచి ప్రతిఘటనలు ఎదురయ్యాయి. దీంతో తప్పక కొన్ని దుకాణాలను శివారున పెట్టాల్సి వచ్చింది. ఇక్కడ వ్యాపారం తక్కువగా ఉండటంతో దాన్ని క్యాష్ కౌంటర్‌గా మార్చేందుకు నాన్‌వెజ్ స్టఫ్‌ను ఆఫర్ చేస్తున్నారు.





టీచర్ల పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతం

ఏలూరు నగరపాలకసంస్థ, ఏడు పురపాలక సంఘాల్లో 48మందికి ప్రమోషన్లు



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న డీఈవో, మునిసిపల్ టీచర్లు

ఏలూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలు అభ్యంతరాలు, సందేహాలు, వాదనలు, వాటిని పరిష్కరించిన తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతి కౌన్సెలింగ్ శుక్రవారం రాత్రి ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలో పదోన్నతులకు అర్హులైన ఆయా మునిసిపాలిటీల్లో సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులతో కూడిన సీనియార్టీ జాబితాలను విద్యాశాఖ ముందుగానే వెబ్‌సైట్‌లో పొందుపరిచినా, రోస్టర్ విషయంలో పలువురు అభ్యంతరాలు లేవనెత్తడంతో ఉదయం నుంచి సర్టిఫికెట్ల పరిశీలనకే పరిమితమైంది. పురపాలకశాఖ ప్రాంతీయ డైరెక్టర్ ఇచ్చిన రోస్టర్ పాయింట్ల రిజిస్టర్ మేరకే సీనియార్టీ జాబితాలను తయారు చేశామని, ఇందులో విద్యాశాఖ ప్రమేయం ఉండబోదని ఉన్నతాధికారులు స్పష్టం చేసినప్పటికీ, ఉపాధ్యాయులు ససేమిరా అనడంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేయడానికి విద్యాశాఖ ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో టీచర్లు పునరాలోచనలో పడ్డారు. దీంతో సీనియార్టీ జాబితాలపై తమకెలాంటి అభ్యంతరాలు లేవని, సంతృప్తి చెందామని మునిసిపల్ ఉపాధ్యాయులతో సంతకాలు చేయించుకుని కౌన్సెలింగ్ ప్రారంభిం చేసరికి రాత్రి 8 గంటలు దాటింది. జిల్లాలోని ఏడు మునిసిపాలిటీల నుంచి దూరాభారంగా వచ్చినందున తొలుత వారికి పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి ఐదు హెచ్‌ఎం, 34 స్కూల్ అసిస్టెంట్ కేడర్ వెకెన్సీలను భర్తీ చేశారు. అనంతరం ఏలూరు నగరపాలక సంస్థలో మొత్తం 11 వెకెన్సీలు భర్తీకావాల్సి ఉండగా, రెండు హెచ్‌ఎం పోస్టులపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వాటిని మినహాయించి, మిగిలిన 9 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతిపై భర్తీ చేశారు. నూతనస్థానాలు కోరుకున్న టీచర్లందరూ శనివారం ఆయా స్థానాల్లో విధుల్లో చేరిన అనంతరం రిలీవై, వచ్చే విద్యాసంవత్సరం తొలి రోజు నుంచి పూర్తి స్థాయిలో రెగ్యులర్‌గా కొనసాగాల్సి ఉంటుందని విద్యాశాఖవర్గాలు తెలిపాయి. కౌన్సెలింగ్ నిర్వహణలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్లు షరీఫ్, అవధాని, కార్యాలయ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

161 క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్‌లస్థానే నూతనంగా ఏర్పాటు చేయతల పెట్టిన క్లస్టర్ల వ్యవస్థపై పాఠశాల విద్యాశాఖ శుక్రవారం స్పష్టతనిచ్చింది. జిల్లాలోని 28 మండలాల్లో ప్రస్తుతం 163 స్కూల్ కాంపెక్స్‌లుండగా, వీటిస్థానంలో కొత్తగా ప్రతిపాధించిన క్లస్టర్లను రెండుగా విభజించనున్నారు. ఆ ప్రకారం ఎ కేటగిరీలో 114 క్లస్టర్లు, బి కేటగిరీలో 47 క్లస్టర్లు కలిపి మొత్తం 161 ఏర్పాటు చేయాలని ప్రతిపాధించారు. వీటి ఏర్పాటుపై అభ్యంతరాలుంటే ఈ నెల 27వ తేదీలోగా తెలియజేయవచ్చునని విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచించారు. ఆ తర్వాత తుది అధికారిక నిర్ణయం తీసుకుంటారు.

కొనసాగుతున్న లంక గ్రామస్తుల ఆందోళన



అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర శ్రీపర్రు గ్రామస్తుల నిరసన

పెదవేగి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లకు సంబంధించిన చేపల చెరువుల కౌలు సొమ్ము దిగమింగి, ఆ సొమ్ముతో లండన్ పారిపోయిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తమకు తీరని అన్యాయం చేశాడని ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొండలరావు పాలెంలో కొఠారు ఇంటి దగ్గర శుక్రవా రం లంక గ్రామాల వాసులు వంటావార్పుతో ఆందోళన కొన సాంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉండగా తమ చెరు వులను లీజుకు తీసుకుని, కౌలు సొమ్ము ఇచ్చే సమయంలో ఇదిగో, అదిగో అంటూ దాటవేత ధోరణితో వ్యవహరించి, ఓటమి అనం తరం కౌలు సొమ్ము ఇవ్వకుండా ముఖం చాటేశాడని వారు ఆరోపించారు.

ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ జరగనివ్వం



గండి బాబ్జిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణను జరగనివ్వబోమని ఆంధ్రప్రదేశ్ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్‌పర్సన్ గండి బాబ్జి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను శుక్రవారం బాబ్జి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, ఎరువుల యాజమాన్యం, వ్యయభారం, రాబడిపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఆయిల్ పామ్ సాగులో రైతులు నష్టాలను చవిచూస్తున్నారని, పెట్టుబడికి తగ్గ ఆదాయం రావడంలేదని, అదే పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఆశించిన రాబడి వస్తుందని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా రైతులకు ఆశించిన ఆదాయం అందించే ఏర్పాటు చేయాలని విన్నవించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్య తనదృష్టికి వచ్చిందని, సమస్య పరిష్కారానికి తనవంతు కృషి, సహకారం అందిస్తానని గండి బాబ్జి చెప్పారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ చేస్తారనే వదంతులు నమ్మవద్దని, పాత ఫ్యాక్టరీ సమీపంలోనే కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, రైతులకు మద్దతు ధర అందించే దిశగా ప్రభుత్వానికి నివేదిస్తామని గండి బాబ్జి చెప్పారు.

నెలాఖరు లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

గణపవరం, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దాళ్వాలో వరిసాగు చేసే రైతులంతా ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. సీహెచ్ అగ్రహారం గ్రామంలో పంటల బీమాపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం తదితర ప్రతికూల పరిస్థితుల వలన పంటకునష్టం ఎదు రైతే రైతులకు తగిన బీమా పరిహారం అందుతుందన్నారు. పంటకు రూ.615 రూపాయల ప్రీమియం సచివాలయం, మీసేవ సెంటర్‌లో ఈ నెలాఖరులోగా చెల్లించాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు ఉన్న ప్రతీ రైతుకు బీమా సౌకర్యం ఉందన్నారు. సదస్సులో ఏడీఏ మురళీకృష్ణ, తహసీల్దార్ అప్పారావు, మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

ఏలూరుసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో ఆర్. విజయరాజు తెలిపారు. జడ్పీటీసీల అభ్యర్థన మేరకు ఈనెల 21 వ తేదీ ఉదయం 10గంటలకు ప్రత్యేక సమావేశం జరుగుతుందని వివరించారు.

నన్నయ వర్శిటీలో పిల్లల మనస్తత్వశాస్త్రం కోర్సు

దివాన్‌చెరువు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాలిసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లమో కోర్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ రెండు బ్యాచ్‌లు ఈ కోర్సును పూర్తిచేశాయని చెప్పారు. ప్రస్తుతం మూడోబ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని అన్నారు. ఏడాది కాలపరిమితితో 40 సీట్లతో ఈకోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు పీజీ డిప్లమా కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల వారు జనవరి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 22న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. మరిన్నివివరాలకు 92462 87989 నెంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డీన్ కేవీ స్వామి, కోర్స్ కోఆర్డినేటర్ నక్కిన నారాయణ, అధ్యాపకులు రాజశేఖర్, సీహెచ్ భవాని తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆపన్న హస్తం



తల్లిదండ్రులు లేని పిల్లలకు పింఛన్
మూడు నెలల్లో నివేదిక
ప్రభుత్వ కీలక నిర్ణయం

భీమవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని నిర్ణయించింది. తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇటీవల రెండు రోజులపాటు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మూడు నెలల వ్యవధిలో తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించాలి. ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. ఆతరువాత వారికి పెన్షన్ మంజూరు చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్‌ల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఒకేసారి అదనంగా వెయ్యిరూపాయల పెన్షన్ పెంచారు. జిల్లాలో సుమారు 2.32 లక్షల మంది పెన్షన్‌లను పొందుతున్నారు.

అనాథాశ్రమాల్లో పిల్లలు

తల్లిదండ్రులు లేని చిన్నారులు అనాథ ఆశ్రమాల్లో ఉంటున్నారు. స్వచ్ఛంద సంస్థలు వారిని పోషిస్తున్నాయి. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో చిన్నారులను పోషించే ఆశ్రమాలు ఉన్నాయి. ఆశ్రమాలు కూడా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ శాఖ పిల్లలను పోషిస్తోంది. తల్లిదండ్రులను కోల్పోవటంతో అనాథలుగా మిగిలిన పిల్లలకు ఆశ్రమాలు ఊరటనిస్తున్నాయి. అటువంటి సంస్థలకు ప్రజల నుంచి కొద్దిపాటి విరాళాలు అందుతున్నాయి. అనేక మంది చేయూతనిచ్చి ఆదుకుంటున్నారు. ఆశ్రమాల్లో ఉంటూనే బడులకు వెళ్తున్నారు. లేదంటే బంధువుల ఇంట పెరుగుతున్నారు. ఇటీవల తాడేపల్లిగూడెం టిట్కో ఇళ్లల్లో అగ్ని ప్రమాదం జరిగింది. భార్య, భర్తలు మరణించారు. వారి 14 ఏళ్ళ కుమార్తె ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. కానీ ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. చిన్నారి బంధువులే ఆలనా, పాలనా చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేకపోవటంతో ప్రజాప్రతినిధులు అధికారులు ఏమి చెయ్యలేకపోయారు. ఇటువంటి చిన్నారులకు ఇప్పుడు మేలు జరగనుంది. తల్లితండ్రులను కోల్పోయిన పిల్లలకు ప్రభుత్వం పెన్షన్ అందించాలనే నిర్ణయం తీసుకుంది. మూడు నెలల్లో జిల్లా కలెక్టర్లు నివేదిక అందిస్తారు. ఆ తరువాత ప్రభుత్వం పెన్షన్ మంజూరు చెయ్యనుంది.

కొత్త పెన్షన్‌ల కోసం ఎదురు చూపు

ప్రభుత్వం పెన్షన్‌లను పెంచటంతో కొత్తగ దరఖాస్తులు చేసుకోవటానికి చాలా మంది ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు వంతున పెన్షన్‌లు ఇస్తోంది. ఫలితంగా పెన్షన్‌లకు డిమాండ్ పెరిగింది. ఏడాదిన్నర కాలంగా కొత్త పెన్షన్‌లను నిలిపివేశారు. వైసీపీ హయాంలోనే నమోదు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం మంజూరు చెయ్యలేదు. జిల్లావ్యాప్తంగా దాదాపు 6వేల మంది అర్హులు పెన్షన్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చెయ్యాల్సి ఉంది. అప్పుడే దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొత్త పెన్షన్‌లకు కసరత్తు చెయ్యనున్నారు.




గ్రామ సచివాలయం నుంచి బయటకు వస్తున్న సర్పంచ్ సౌజన్య ఆమె భర్త బెనర్జీ.. 11వవార్డు సభ్యురాలు కాగిత నాగమణి ఆమె భర్త విష్ణు

పంచాయతీ సమావేశంలో డిష్యుం.. డిష్యుం!

ఉండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):దళిత మహిళా సర్పంచ్‌పై పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త దాడి చేసిన సంఘటన ఇది. ఉండి గ్రామ సచివాలయం పైఅంతస్తులో శుక్రవారం పంచాయతీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతుండగా 11వ వార్డు సభ్యురాలు కాగిత నాగమణి భర్త విష్ణు(విజ్జు) కలుగజేసుకుని పంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి దుర్వినియోగం చేశారంటూ ఆరోపించారు. దీనిపై సర్పంచ్ సౌజన్య కలుగజేసుకుని బయట వారు ఎవరు సమావేశాలకు రావద్దని చెప్పాం అయినా మీరు వచ్చి ప్రశ్నించడం మంచిది కాదన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు వాగ్వి వాదానికి దిగి చేయి చేసుకున్నారు. అనంతరం సర్పంచ్ భర్త బెనర్జీ వార్డు సభ్యురాలు నాగమణి భర్త విష్ణు ఘర్షణ పడ్డారు. అనంతరం రెండు వర్గాలు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.



సమావేశమైన ఓబీసీ రాష్ట్ర నాయకులు

ఓబీసీలకు గుర్తింపు దక్కడం లేదు..

భీమవరం టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి దేశం గర్వపడే స్థాయిలో తమ వంతు పాత్ర పోషించినప్పటికి ఓబీసీలకు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదని, అధికార పాలక వర్గాలు ఓబీసీలను వెనుకబాటు తనంలోకి నెట్టివేస్తున్నాయని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విమర్శించారు. భీమవరం టౌన్ హాల్లో శుక్రవారంనాడు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఓబీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి వల్ల నష్టపో తున్నారని, విద్య, ఉద్యోగ, ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలలో శాశ్వతంగా దూరం చేయబడ్డారని, ఫలితంగా సామాజిక అసమానతలకు గురికాబడ్డారని అన్నారు. ఓబీసీల స్థితిగతులు మెరుగుపడాలంటే కుల గణనే పరిష్కార మార్గ మని, 2010లో బీజేపీ ప్రతిపక్ష పార్టీ హోదాలో లోక్‌సభలో 2014ఎన్నికల్లో అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని అన్నారన్నారు. అధికారానికి వచ్చారు కానీ ఓబీసీ జనగణన చేపడతారన్న నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలని, బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని, భారత దేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన దేశంలో 60 శాతం పైనే ఉన్నా బీసీకులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దేశంలో బీసీలకు ఒక న్యాయం, ఇతర వర్గాలకు ఒక న్యాయం జరుగుతుందని భారత దేశంలో ఉన్న 80 కోట్ల మంది బీసీ ప్రజలు భావించారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుల గణన చేసి బీసీ ప్రజల హక్కులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో వీరి శాతం వాటా దక్కేలాగ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంత రావు, జిల్లా నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరంలో తల్లిపాల బ్యాంక్ ప్రారంభం



ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి పాల బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, తోట సీతారామలక్ష్మి

భీమవరం క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులు అంటువ్యాధులు, నీళ్ళ విరోచనాలు, శ్వాసకోశ వ్యాధుల బారినపడకుండా పుట్టిన గంటలోనే తల్లిపాలు అందజేస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల బ్యాంక్‌ను శుక్రవారం జేసీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు అందించటం ద్వారా 22 శాతం నవజాత శిశువుల మరణాలు నివారించవచ్చు అన్నారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు ఇవ్వడం ద్వారా ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలు 13 శాతం వరకు నివారించవచ్చు అని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం రక్తస్రావం, రొమ్ము క్యాన్సర్, అండాశయపు క్యాన్సర్, గర్భకోశ క్యాన్సర్, ఎముకల బలహీనత తదితర జబ్బులు నుంచి తల్లికి రక్షణ కలుగుతాయన్నారు. అనంతరం నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీసీ) ఛైర్మన్ డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్, సుషేణా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీ కళ్యాణి పాల్గొన్నారు.



హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

ఆచంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్నివిధాలుగా ఆయుపట్టుగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ వైద్య ఉద్యోగులందరూ ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. వల్లూరు పీహెచ్‌సీ ఆవరణంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ కావాలి.. పీహెచ్‌సీలకు రావాలి అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలోవైద్య ఉద్యోగులందరూ పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కాకుండా అందరికి ఆరోగ్యం అందించే ప్రాథమిక వైద్యాలయంలో అన్ని విధాలా సహాయకులుగా హెల్త్ అసిస్టెంట్‌లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఇదే విషయాన్ని పీహెచ్‌సీల నుంచి మెయిల్ ద్వారా ఉద్యోగులందరూ కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు వేణుబాబు, హైందవి, టి. వసంత కుమారి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



గంజాయి విక్రేతల అరెస్టు

కలిదిండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో 22 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ రవికుమార్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కలిదిండికి చెందిన ఎస్‌కె.జిలాని (24), ఎండి.అల్తాఫ్ (27), ఎండి.అమీర్ బాషా (21), బోయిన నీలసాయి (24)లను కలిదిండి మార్కెట్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించామని సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

గులాబీ తోటలో చోరీ

81 గ్రాముల బంగారం, అరకేజీ వెండి అపహరణ

ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కింద పోర్షన్‌కు తాళం వేసి ఇంటి పైపోర్షన్‌లో నిద్రించి తెల్లవారుజామున వచ్చేటప్పటికి కింద పోర్షన్ తాళాలు దొంగలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని గులాబీ తోటలో నివాసం ఉంటున్న రామ్ లాల్ సింగ్ ఈనెల 19వ తేదీ రాత్రి ఆయన, ఆయన భార్య కింద పోర్షన్‌కు తాళాలు వేసి పై పోర్షన్‌లో నిద్రించారు. శుక్రవారం ఉదయం కిందకు వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 81 గ్రాముల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మదినా బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య



శివ గణేశ్ (ఫైల్)

భీమడోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్థాపానికి గురైన భర్త పురుగు మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి రాఘంపేట గ్రామానికి చెందిన నాళం శివగణేశ్ (28)కు వివాహం అయి కుమారుడు ఉన్నాడు. పదేళ్ళుగా భీమడోలు మండలంలోని అంబర్‌పేటలో ఉన్న సిరామిక్ కంపెనీలో పని చేస్తున్నాడు. భీమడోలు గ్రామంలో భార్య పిల్లలతో ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం శివగణేశ్ ఇంట్లోనే మద్యం తాగుతుంటే భార్య లక్ష్మీ ప్రసన్న ఆరోగ్యం పాడవుతుందని మందలిం చగా మనస్థాపానికి గురైన శివ గణేశ్ ఇంటి నుంచి బయటకు వెళ్ళి కొద్ది సమయం తరువాత మళ్ళీ వచ్చి కలుపు మందుతాగానని భార్యకు చెప్పాడు. వెంటనే భార్య భీమడోలు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 19వ తేదీ మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్ పేట గేటు సమీ పంలోని ఒక ఇంటి మెట్లపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందా డు. ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వ ర్యంలో ఎస్‌ఐ వైకె దానం, ఏఎస్‌ఐ బ్రహ్మ నందం శుక్రవారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగి తెలుపు రంగు టీషర్టు, తెలుపు రంగు లుంగీ, తలకు టోపీ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభు త్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్‌నెంబర్ 08812 - 230652 కాని ఎస్‌ఐ దానం సెల్ నెంబర్ 94404 11000కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. మైసన్నగూడెం గ్రామానికి చెందిన పిల్లి శ్రీను జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు మీదుగా జీలుగుమిల్లి వెళ్తుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో పిల్లి శ్రీను కాలికి తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని, కారును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులు

యలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రు గ్రామానికి చెందిన చెల్లింకుల వాణి శుక్రవారంనాడు ఫిర్యాదు చెయ్యటంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కర్సిడి గుర్రయ్య తెలిపారు. వాణికి 2021 సంవత్సరంలో పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్ళవాని గురువుకు చెందిన పాండు రంగప్రసాద్‌తో వివాహం చేశారు. ఈ దంపతులకు ఒక కుమారుడు కలిగిన తరువాత ప్రసాద్ అదనపు కట్నం కోసం భార్యను వేధించటం ప్రారంభించాడని తెలిపారు. భర్త పెట్టే వేధింపులు భరించలేక ఫిర్యాదు చేసిందని దీనిపై కేసు నమోదు చేశామని వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకోడేరు, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతూ అదుపు తప్పి పడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. ఈ నెల 12వ తేదీన భీమవరం శివారు చినరంగనిపాలెం నుంచి మోటార్ బైక్‌పై వీరవల్లి ఉపేంద్ర, గుబ్బల ఉమాశంకర్ (23)లు కలిసి గొరగనమూడిలోని స్నేహితుని ఇంటి వద్దకు వెళ్తున్నారు. విస్సాకోడేరు సాయిబాబా గుడి వద్దకు వచ్చేసరికి వీరి ముందు వెళ్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఉమాశంకర్ తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు భీమవరం ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు, ఏలూరు నుంచి గుంటూరు తరలించారు. ఆరోజు నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పాలకోడేరు ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదు చేసి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.

అత్త,కోడళ్ళపై దాడి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఎల్‌ఈడీ టివి, ఇతర సామగ్రి ధ్వంసం చేయడంతో పాటు అత్త,కోడళ్ళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. మైసన్నగూడెం గ్రామానికి చెందిన నంబూరి సరోజిని ఇంట్లోకి కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్వరరావు ఈ నెల 12వ తేదీన అక్రమంగా ప్రవేశించి ఈ ఇల్లు తనదేనని, ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని సరోజిని అత్తపై దౌర్జన్యం చేయడమే కాకుండా ఆమెను కొట్టాడు.అడ్డు వెళ్ళిన కోడలు సరోజిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి కొట్టాడు. ఆమె భర్త నాగరాజును రాయితో కొట్టి గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలు సరోజిని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

జీతాలు ఇవ్వకుంటే సమ్మె

జిల్లా, ఏరియా ఆస్పత్రుల పారిశుధ్య కార్మికుల నిరసన



ఏలూరులో జిల్లా ఆస్పత్రి వద్ద కార్మికుల ధర్నా

ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పారిశుధ్య కార్మికులు వేతన బకాయిల కోసం ఆందోళన బాట పట్టారు. ఐదు నెలల నుంచి జీతాలు చెల్లించాలని, మూడు రోజుల్లో చెల్లించకుంటే నిరవధిక సమ్మె చేస్తామని ఏపీ మెడికల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి పి.దత్తాత్రేయ ప్రకటించారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం గంట సేపు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఐదు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ ద్వారా తెలిపినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ధర్నాలో పారిశుధ్య నాయకులు విజయ, జయ, ఝాన్సీ, సెక్యూరిటీ సూపర్‌వైజర్ మైఖేల్‌రాజు పలువురు నాయకత్వం వహించారు.

● చింతలపూడి: స్థానిక ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు టి.బాబు మాట్లాడుతూ మంత్రి, ఉన్నతాధికారులకు చెప్పినా స్పందించ లేదన్నారు. ధర్నాలో ఏరియా ఆసుపత్రి నాయకురాలు టి.మరియమ్మ, రాజు, రామకృష్ణ, రామమ్మ తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

● బుట్టాయగూడెం: పారిశుధ్య కా ర్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. బేతి కిషోర్ మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు రాజు, మునేశ్వరావు, కృష్ణ, వెంకటేశ్వరావు, చిన్నబాబు, సుజాత, సత్యవతి, సుందరమ్మ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. పారిశుధ్య కార్మికుల వేతన చెల్లింపులో కాలయాపన చేస్తున్నారని కూనపాముల విజ్ఞేష్ అన్నారు. బకాయి వెంటనే చెల్లించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని కుంచె వసంతరావు హెచ్చరించారు. జంపన వెంకటరమణరాజు, కంటేటి వెంకటరావు, బొక్కా శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సంఘ అధ్యక్షురాలు దయామణి,మేరీ, ప్రభావతి, రాజు, సంజీవరావు, శ్రీను, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు వివరిస్తున్న విఠల్

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతికి కృషిచేయాలని ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్ మంత్రులు సవిత, సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో బీసీ మంత్రులకు వినతిపత్రం అందజేసినట్లు విఠల్ కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రులు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. పి.భూషణరావు, టి.శ్రీధర్, కేదారేశ్వరరావు, రంగనాయకులు, శంకర్, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఎల్‌ఐసీని రక్షించండి : ఉద్యోగ సంఘాలు



ఎల్‌ఐసీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏలూరు బ్రాంచి కార్యాలయం వద్ద ఉద్యోగులు జెండా ఆవిష్కరించారు. బ్రాంచి కన్వీనర్ కె.రాంబాబు, యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఎల్‌ఐసీ ఏవోపి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రవికిశోర్ మాట్లాడుతూ ఎల్‌ఐసి సంస్థను నిర్వీర్యం చేయడానికి ఐఆర్‌డీఏ ప్రతి పాదనలను వ్యతిరేకించాలని, చలో పార్లమెంట్ ధర్నాకు ఏజెంట్లు అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎల్ ఐసి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఈ పోరాటానికి ఏజెంట్లు నాయకత్వం వహించాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ కమిటీ నాయకులు డీవీ రామకృష్ణ, జోనల్ నాయకులు రామ్మోహన్‌రావు, సాంబశివరావు, కనకారావు, టి.సురేష్, కట్టా సుబ్బారావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, బ్రాంచి ఏబిఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్పొరేటీకరణ చర్యలు వద్దు



ప్రజా సంఘాల నాయకుల సంఘీభావం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చర్యలు తగదని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పవరుపేటలోని అన్నేభవనం వద్ద శుక్రవారం వ్యవసాయ సంఘ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈనెల 23న సంయుక్త కిసాన్ మోర్చ దేశ వ్యాప్త పిలుపు మేరకు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలను ధ్వంసం చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ హామీలు అమలు చేయాలని, రైతులతో చర్చలు జరపాలని కోరారు. 23న జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘ నాయకులు కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహన్‌రావు, వి.శివనాగమణి, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. 23న జరిగే నిరసన కార్యక్రమానికి సంఘ నాయకులు సంఘీభావం తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటితొట్టెను పరిశీలిస్తున్న డీఎంవో ప్రసాద్, తదితరులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తంగెళ్ళమూడి, యాదవ్‌నగర్, ముట్లకోసేరు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ, ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ శీతాకాలంలో దగ్గు, జలుబు, ఆయాసం, ఎలర్జీ, వైరల్ ఫీవర్లు ప్రబలే అవకాశం ఉన్నాయన్నారు. గోరువెచ్చని నీరు తాగడం, వేడి ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఉపశమనం ఉంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. నీటి తొట్లను వారానికోసారి శుభ్రపరచుకుని, మూతలు పెట్టుకోవాలని సూచించారు. డాక్టర్ చక్రధర్, డాక్టర్ రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ఏలూరులో నిరసన తెలుపుతున్న దళిత నేతలు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ నేతలు చాగంటి సంజీవ్, నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రసాద్, మేతర అజయ్‌బాబు, దాసరి నాగేంద్ర కుమార్, కె.రవి, ఎ.విజయ్, దాసరి శ్యాం, మెండెం ఆనంద్ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఏపీ మాల ఉద్యోగుల సంఘం నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అమిత్‌షా దిష్టిబొమ్మను తగలబెట్టారు. బేతాళ సుదర్శనం లీలామోహన్, నాగరాజు, సాయిబాబా, సర్వేశ్వరరావు, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అమిత్‌షాను పదవుల నుంచి తక్షణమే తొలగించాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం, కేవీపీఎస్ డిమాండ్ చేశాయి. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు నిరసన తెలిపారు. తెల్లం రామకృష్ణ, ధర్మాల రమేష్, అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరావు, చుంద్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, కూరం సత్యనారాయణ, ఉడతా వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదాత కలవరం

● జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు ● హడావుడి ధాన్యం తరలింపు



పాలగూడెంలో ధాన్యం తరలిస్తున్న రైతులు

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. ఈ నెలలో ఇప్పటికే రెండు సార్లు అల్పపీడనం, వాతావరణ మార్పులతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం చిరు జల్లుతో రెండు, మూడు రోజుల్లో కోతలు పూర్తిచేసి కుప్పవేయని రైతులు గుబులు చెందుతున్నారు. వర్షంతో ధాన్యం తడిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వరి కుప్పలు చేలలో ఉండడంతో దిగులు చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం తేలికపాటి జల్లులు పడ్డాయి. ధాన్యాన్ని కాపాడుకోడానికి అవస్థలు పడుతున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రవాణాకు వాహనాలు లేకపోవడంతో కొంతమంది రైతులు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని మిల్లులకు తరలిస్తున్నారు. మిగిలిన పంట రక్షణకు కష్టాలు పడుతున్నారు. పంట పొలాల వద్ద ధాన్యం బస్తాలను ఇళ్ళు, రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు.

పోలవరంలో వర్షం..

పోలవరం: మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి ప్రతికూల వాతావరణంతో రైతులు చేలలో వరి పనలను, ధాన్యపు రాశులను బయటకు తరలించారు. పట్టిసీమ ఫెర్రీ పాయింట్ సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో, పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్ వద్ద హెలీప్యాడ్ ప్రాంతం, వెంకటాపురం హెలీప్యాడ్ ప్రాంతంలో ఆరబెట్టారు. వర్షాభావం ప్రభావంతో ధాన్యపు కల్లాలపై బరకాలు కప్పి భద్రపరిచారు. గిట్టుబాటు ధర వచ్చేవరకూ ధాన్యం కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు 50 టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు.

తల్లీ కుమార్తె అదృశ్యం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్య తరచూ ఫోన్ మాట్లాడుతుందని భర్త గద్దించడంతో కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. తాండ్ర పాపారాయుడు సెంటర్‌లో నివసిస్తున్న మల్లిపూడి వీర వెంకటేష్‌కు భార్య ముగ్గురు పిల్లలున్నారు. ఈ నెల 12న వెంకటేష్ భార్య తరచూ ఫోన్ మాట్లాడుతుందని గద్దించాడు. దీనితో ఆమె తన భర్తకు చెప్పకుండా కుమార్తెను తీసుకుని వెళ్లిపోయింది. బంధువుల ఇంటివద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పేకాటలో ఐదుగురు అరెస్టు

ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పొలాల్లో శుక్రవారం సాయంత్రం కొంత మంది పేకాట ఆడుతున్నట్లు రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్‌కు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో వెళ్ళి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 5,100 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో వాహన తనిఖీలు

ఏలూరు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీసులు గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, లాడ్జీలను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రి వేళ వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళ నేరాల నియంత్రణకు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. గంజాయి, సారా, అక్రమ మద్యం ఇతర ప్రాంతాలకు రవాణా కాకుండా విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఏటీఎంలు, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు.

పశు వైద్య శిబిరం

భీమడోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీ సాయిరమేష్ సూచించారు. గుండుగొలనులో శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. డీఎల్‌డీఏ ఈవో రామకృష్ణ, వైద్యులు హరికృష్ణ, రమ్యశ్రీ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం : ఎమ్మెల్యే బడేటి చంటి



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన వినతులు స్వీకరించారు. స్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. టిడ్కో గృహాలు కూడా త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఉద్యోగుల బదిలీలు, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, ఎం.పార్థసారధి, పెద్దిబోయిన శివప్రసాద్, అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి రవాణాకు అనుమతించండి



మండల సమావేశంలో విజ్ఞప్తి చేస్తున్న ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలు ఇళ్ల పునాదుల్లో వేసుకోడానికి మట్టి దొరక్క అనేక ఇబ్బందులు పడుతున్నారని, మట్టి రవాణాకు అధికారులు అనుమతించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం శుక్రవారం జరిగింది. మట్టి సమస్యను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ వీవీ.చలపతిరావు మాట్లాడుతూ ఇరిగేషన్ అనుమతి ఉంటే మట్టి తెచ్చుకోవచ్చన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. తల్లిదండ్రులు చనిపోతే ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసి ఐదు నెలలైనా ఎందుకు ఇవ్వలేదని కేఆర్.పురం సర్పంచ్ ఉయికె బుజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సర్టిఫికెట్ జారీకి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇతర శాఖల్లో పలు సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

చింతలపూడి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతి నిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని ఎంపీపీ బి.రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు ప్రజాప్రతినిధులకు చెప్పడం లేదని, ప్రజలు అడిగితే ఏవిధంగా సమాధానం చెప్పగలరన్నారు. యర్రగుంటపల్లి, సీతానగరం గ్రామాలకు సీసీ రోడ్లు మంజూరయ్యాయని, రేచర్ల శ్మశాన వాటికకు లక్షా 30 వేలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. పామాయిల్‌కు మొక్కలు సబ్సిడీపై ఇస్తున్నారని వాటిని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి కోరారు. ఆర్‌అండ్‌బి రోడ్లు గోతుల మరమ్మతులు జరుగుతున్నట్టు ఏఈ సుందరరావు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన విషయాలు సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా, ఉపాధ్యక్షురాలు సాదరబోయిన వరలక్ష్మి మాట్లాడారు. పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.





ఏలూరు తహసీల్దార్ కార్యాలయం, దెందులూరు మండలం వేగవరం చర్చి, పెదపాడు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

సెమీ క్రిస్మస్ వేడుక

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి రెవెన్యూ ఉద్యోగులు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జీవీ.శేషగిరి కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. డీటీ ప్రమోద్‌కుమార్, గాయత్రి, సర్వేయర్ విజయరాజు, వీఆర్వోలు పుట్టా అజయ్, పి.జాన్, తాడి వరప్రసాద్, ఎస్‌కె.బాషా, పామర్తి గోపి, కత్తి కాంతారావు, జోజి, వల్లీ, ఎస్.కె.ఖలీల్, అనురుధ్ పాల్గొన్నారు.

● దెందులూరు: అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు చర్చిలలో క్రైస్తవులకు చీరలు, బియ్యం, నూనె, కందిపప్పు, దుస్తులను అందజేశారు. కొత్తపేటలోని కృప సహవాస సంఘం చర్చిలో పాస్టర్ కె.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో 50 మందికి సరుకులు, చీరలను ట్రస్టు ఇన్‌చార్జి షేక్ అయ్యూబ్ బాలనాగరాజు, అక్కిగోపి సభ్యుల బృందం అందజేశారు.

● పెదపాడు: క్రీస్తు జననం ప్రపంచ మానవాళికి పండుగ రోజని ఎంఈవో ఎస్.నరసింహమూర్తి అన్నారు. మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెయింట్ జేవియర్ ఫాదర్ మైఖేల్ ఇంజిమాల క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. పలువురు చిన్నారులు క్రీస్తు ఆరాధన గీతాలతో అలరించారు. క్రీస్తు జననాన్ని తెలిపే పశువుల పాక ఏర్పాటు ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో రాజ్‌ప్రసాద్, ప్రతాప్, కార్యనిర్వాహకులు కాటి వెంకటరమణ, కృపాకర్, శరత్ బాబు, జయప్రకాష్, రంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్: ఏసుక్రీస్తు చూపిన శాంతి, ప్రేమ, దయ, క్షమాగుణాలను కలిగి జీవించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి జయరావు పొలిమెర అన్నారు. బిషప్స్ హౌస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మానవాళి రక్షణార్థమై ప్రభువైన ఏసుక్రీస్తు ఈ లోకంలోనికి వచ్చారన్నారు. ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేల్, బిషప్స్ హౌస్ కోశాధికారి రెవరెండ్ ఫాదర్ బేతంపూడి రాజు, రెవరెండ్ ఫాదర్ తోట అంథోని, రెవరెండ్ ఫాదర్ చిన్ను, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు చెప్పండి

● రెవెన్యూ సదస్సులలో అధికారులు



పెదపాడు రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీ ఇస్తున్న రైతులు

కామవరపుకోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతుల రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ గెడ్డం ఎలీషా అన్నారు. మండలంలోని గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం సచివాలయం వద్ద శుక్రవారం సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ పి.రామకృష్ణ, వీఆర్వో ప్రభాకరరావు, గ్రామ కార్యదర్శి బి.రత్నకుమారి, స్థానికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదపాడు: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేత గుత్తా అనిల్ తెలిపారు. పెదపాడు సదస్సులో పలు సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. అర్జీలను ఆన్‌లైన్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. బొప్పన బాబ్జి, గారపాటి మోహనరావు, ఖండవల్లి జరహో, దావాల రమేష్, వీఆర్వోలు నరసింహ, ప్రసాద్, ఇవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని భూ సమస్యలను సత్వరం పరిష్కరించుకోవాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. ప్రగడపల్లిలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వగ్రామ పంచాయతీలో రెవెన్యూ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు బొరగం శ్రీనివాసులుకి శాలువా కప్పి సన్మానించారు. తహసీల్దారు సాయిరాజు, చాపర్ల వెంకటాచలం, సర్పంచ్ కలుం బాపిరాజు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: రవ్వారిగూడెం, మెరకగూడెంలో రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ వీవీ.చలపతిరావు నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని, సాగులో ఉన్నవారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గిరిజనులు అధికారుల దృష్టికి తెచ్చారు. రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: భూసమస్యల పరిష్కారమే గ్రామసభ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఎ.రామ్ కుమార్ అన్నారు. భోగాపురంలో పలువురు రైతులు భూసమస్యలపై వినతులు అందించారు. ఆర్‌ఐ కేవీ.సారధి, సర్వేయర్ సత్యనారాయణ మూర్తి, బీహెచ్ ఎస్వీ.కృష్ణంరాజు పాల్గొన్నారు.

● లింగపాలెం: దీర్ఘకాలిక అపరిష్కృత భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ నజీముల్లా షా అన్నారు. పాచ్యానగరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలను స్వీకరించారు. 45రోజులలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 12 అర్జీలు రాగా 7 అర్జీలను పరిష్కరించామన్నారు. డీటీ నాగబాబు, సర్పంచ్‌లు యలమంచి శ్రీనివాసరావు, తొమ్మండ్రు మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఉంగుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అనారోగ్యం బారిన పడిన 12 మంది పేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి కొంత సొమ్ము మంజూరైంది. రూ.8,39,365 మొత్తాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం లబ్ధిదారులకు అందించారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై శ్రీలక్ష్మీనారసింహుని ఆలయాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4.84 లక్షల చెక్కు రూపేణా కొత్తగూడెం, జి.కొత్తపల్లి, దేవినేనివారిగూడెం, తిరుమలంపాలెం, రామన్నగూడెంకు చెందిన వారికి అందజేశారు. లంకా సత్తిపండు, రేగంటి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అన్నారు. డీఈఈ కె.ఎం అంబేద్కర్ ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. పి.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.శివకుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు పూర్తి అవుతుందని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. క్రాంతి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ద్వారకాతిరుమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎం.నాగులపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. కరెంటు ఛార్జీలతో సామాన్యుని నడ్డి విరుస్తున్నారని సీపీఎం నేత కట్టా భాస్కరరావు అన్నారు. సీపీఎం నేతలు పాలుకొండ నాగరాజు, పదిలం కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ జయంతి

ఉంగుటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ దేశ గణిత శాస్త్రానికి గణనీయమైన సేవలు అందించారని గోయంకా కళాశాల గణిత అధ్యాపకుడు రామబ్రహ్మం అన్నారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమంలో పుట్టా బాబూరావు, రెడ్డియ్య, బీవీ.రెడ్డి, బి.రాజు తదితరులు మాట్లాడారు. ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామబ్రహ్మంను సత్కరించారు. క్విజ్ విజేతలకు నగదు బహుమతులు అందించారు.

● జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణితశాస్త్రం ప్రతి ఒక్కరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగం అన్నారు. కళాశాల గణిత అధ్యాపకుడు సీహెచ్.బదరినారాయణ మాట్లాడుతూ గణితశాస్త్రానికి శ్రీనివాసరామానుజన్ చేసిన కృషి భారతీయులు మర్చిపోరన్నారు. దేశానికి ఆయన ఎనలేని సేవలు అందించారని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు పి.దుర్గావతి, బి.శ్రీనివాసరావు, వెంకటాచార్యులు, పి.సన్యాసిరావు, కె.ఉత్తమ్‌సాగర్, జి.వెంకట్‌లాల్, రమాదేవి, విజయ, దీపిక, శిరీష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కోరలు..!

- ఇంటింటా సర్వేలో విస్తుబోయే నిజాలు
- ప్రతి ఇంట్లోనూ బీపీ, షుగర్ కేసులు
- కొత్తగా 35 వేలు దాటేసిన రక్తపోటు
- 27 వేలమందికి పైగానే తీపిజబ్బు
- 225 మందికి క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ
- మరో 1912 మందికి అనుమానిత లక్షణాలు
- ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వైద్యసేవల విభాగం
- ఏప్రిల్‌లోగా ఏరియా ఆస్పత్రుల్లో కీమోథెరఫీ వైద్యసేవలు
- మరో ఆరు నెలలపాటు స్ర్కీనింగ్ క్యాంపులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్యాన్సర్, జీవనశైలి వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 18 ఏళ్ళ వయసు నుంచే రోగాలు సోకుతున్నాయి. అశ్రద్ధ వహి స్తుండటంతో అంతకంతకూ ముదిరిపోతు న్నాయి. క్యాన్సర్, బీపీ, మధు మేహం వ్యాధులను ఆదిలోనే గుర్తించి, వాటికి సరైన వైద్యచికిత్సలు, అవగాహనలతో కొంత వరకైనా నియంత్రిం చాలనే సంకల్పంతో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 14 నుంచి చేపట్టిన ఇంటింటా క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం స్ర్కీనింగ్ క్యాంపులు ప్రారంభించిన తొలి విడతలోనే జిల్లాకు సంబంధించి ఆందోళనకర నివేదికలు ఒకింత భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రమాదకర వ్యాధుల తీవ్రత, జిల్లాలో నియంత్రణ చర్యలపై ఓ పరిశీలన.

సర్వేలో ఆందోళనకర వాస్తవాలు

జిల్లావ్యాప్తంగా గతనెల 14 నుంచి అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో ప్రతీ ఇంటిని సందర్శించి 18 ఏళ్ళ వయసుపైబడిన యువతులు, మహిళలు, పురుషులకు ఆరోగ్య పరీక్షలను చేయడానికి ఒక్కో సచివాలయానికి ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లతో కూడిన మొత్తం 605 బృందాలను నియమిం చారు. ఈ బృందాలు సంబంధిత సచివాలయ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి నిర్దేశిత వయసుగల వారిని ప్రాథమికంగా పరీక్షించి మూడు రకాల క్యాన్సర్ లక్షణాలు, బీపీ, షుగర్ లతో బాధపడుతున్న వారిని గుర్తిస్తాయి. ఇందు కుగాను ఈ బృందాలకు ముందుగానే శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఈ బృందాల నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం వరకు సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించగా, ఆందోళనకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో 18 సంవత్సరాల వయసు నిండిన జనాభా 16,74, 079 మంది కాగా, వీరిలో శుక్రవారం వరకు 2,02,445 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్దేశిత వ్యాధులపై చేశారు. క్రోడీకరించిన గణాంకాల ప్రకారం జిల్లాలో అధిక రక్తపోటుతో 35,359 మంది బాధపడుతున్నట్టు నిర్ధారణకాగా, మరో 23,421 మంది అనుమానిత లక్షణాలతో ఉన్నట్టు గుర్తించారు. మధుమేహ వ్యాధి 27,662 మందికి కన్ఫర్మ్ కాగా, మరో 29,350 మందికి తీపిజబ్బు అనుమానిత లక్షణాలున్నట్టు తేల్చారు. ఇక సమాజంలో వేగంగా విస్తరిస్తోన్న క్యాన్సర్ రోగ నిర్ధారణ ప్రాథమిక పరీక్షలతో కొత్తరోగులు వెలు గులోకి వస్తున్నారు. పొగాకు ఉత్పత్తులు నమలడం, దూమపానం, తదితర కారణాలతో నోటిలో సంభవించే అల్సర్ల వల్ల సోకే ఓరల్ క్యాన్సర్ జిల్లాలో 45 మందికి నిర్ధారణకాగా, మరో 693 మందికి అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించి తదుపరి నిర్ధారణ పరీక్షలకు సిఫారసు చేశారు. కుటుంబ చరిత్ర, బహుళ వ్యక్తులతో అనైతిక లైంగిక సంబంధాలు, అరక్షిత లైంగిక సంపర్కం, సుఖవ్యాధుల వైరస్‌ల కారణంగా ఏర్పడే గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ జిల్లాలో 77 మందికి సోకినట్టు ప్రాథమిక పరీక్షల్లో నిర్ధారణ కాగా, మరో 641 మంది ఇంచు మించుగా అవే లక్షణాలతో ఉన్నట్టు అనుమా నితుల జాబితాలో చేర్చారు. ఆలస్యపు వివాహాలు, తదితర కారణాలతో పుట్టినబిడ్డకు తల్లిపాలు ఆలస్యంగా ఇవ్వడం, కుటుంబచరిత్ర, రొమ్ముల పరిమా ణంలో మార్పులు, రసాయనాల ప్రభావం వున్న జంక్‌ఫుడ్ భుజించడం తదితర కారణాలతో సంభవించే రొమ్ము(బ్రెస్ట్)క్యాన్సర్ 103 మంది మహిళలకు నిర్ధారణకాగా, మరో 578 మందికి అనుమానిత లక్షణాలున్నట్టు తేల్చారు. ఈ గణాంకాలన్నీ నెలరోజుల స్ర్కీనింగ్ క్యాంపుల నివేదికలు కాగా, ఇంకా ఆరు నెలల పాటు ఈ ఆరోగ్య పరీక్షలు ఇంటింటా జరగాల్సి ఉంది.

వచ్చేవారం నుంచే తుది నిర్ధారణ, వైద్య చికిత్సలకు ఏర్పాట్లు

ఊహించనంతగా క్యాన్సర్ కేసులు వెలుగులోకి వస్తుండటంతో ఇప్పటికే ప్రాథమిక పరీక్షల్లో రోగనిర్ధారణ జరిగినవారితో పాటు, అనుమానిత లక్షణాలున్నవారికి వైద్య నిపుణు లతో తుదిపరీక్షలు నిర్వహించి నిర్ధారించు కునేందుకు వారం రోజుల వ్యవధిలోనే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఇందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా జోన్-2 పరిధిలో రాజమహేంద్ర వరం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడల లోని జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రుల్లో క్యాన్సర్ రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్యచికిత్సల కోసం రూంనెంబరు 222తో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయి స్ర్కీనింగ్ క్యాంపుల్లో గుర్తించినవారికి పింక్‌కలర్ రిఫరల్ బుక్‌లను ఇచ్చి జిల్లా ఆస్పత్రులకు పంపిస్తారు. ప్రతీ మంగళ, గురువారాల్లో వీరందరికీ ప్రత్యేకరూం 222లో తుది రోగనిర్ధారణ పరీక్షలు, వైద్య చికిత్సల కోసం మూడురకాల క్యాన్సర్‌ల నిర్ధారణ నిమిత్తం ఒక సర్జికల్ అంకాలజిస్టు, ఒక డెంటిస్టు, ఒక గైనకాలజిస్టు అందుబాటులో ఉంటారు. వీరందరినీ సమన్వయపరిచేందుకు ఒక కమ్యూ నిటీ మెడికల్ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. గుర్తించిన రోగులనుంచి బయా ప్సీని సేకరించి క్యాన్సర్ నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపిస్తారు. ల్యాబ్ నివేదిక మూడు నుంచి ఏడు రోజుల వ్యవధిలో వస్తుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏలూరు ప్రభుత్వాసుపత్రి లోనే బయాప్సీ నమూనాలను పరీక్షించేందుకు ల్యాబ్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వ్యాధి తీవ్రత, స్టేజ్‌నుబట్టి రోగికి అవసరమైన చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రి లేదా ఎన్టీఆర్ వైద్య చికిత్సకింద గుర్తించిన ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స ఇప్పిస్తారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లోగా జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లోనే డే కేర్ విధా నంలో కీమోథెరఫీ చికిత్సను స్థానికంగా అందిం చేందుకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

మద్యం వద్దన్నందుకు ఆత్మహత్య


శివ గణేశ్ (ఫైల్)

భీమడోలు, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): మద్యం తాగవద్దని భార్య మందలించడంతో మనస్థాపానికి గురై న భర్త పురుగు మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసు లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి రాఘంపేట గ్రామానికి చెందిన నాళం శివగణేశ్ (28)కు వివాహం అయి కుమారుడు ఉన్నాడు. పదేళ్ళుగా భీమడోలు మండలంలోని అంబర్ పేటలో ఉన్న సిరామిక్ కంపెనీలో పని చేస్తు న్నాడు. భీమడోలు గ్రామంలో భార్య పిల్లలతో ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం శివగణేశ్ ఇంట్లోనే మద్యం తాగుతుంటే భార్య లక్ష్మీ ప్రసన్న ఆరోగ్యం పాడవుతుందని మందలిం చగా మనస్థాపానికి గురైన శివ గణేశ్ ఇంటి నుంచి బయటకు వెళ్ళి కొద్ది సమయం తరువాత మళ్ళీ వచ్చి కలుపు మందుతాగానని భార్యకు చెప్పాడు. వెంటనే భార్య భీమడోలు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 19వ తేదీ మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన

ముసునూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష సమయం ఒక గంట ముందు ఉపాధ్యాయులు పాఠశాలకు తీసుకువెళ్ళాలని ఉన్నతాధికారుల నిర్ణయాన్ని యూటీఎఫ్ నాయకులు ఖండిం చారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యా శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఎంఈవో బి.వి.ఎస్ సుబ్బారావుకు వినతపత్రం అందజేశారు. ఈ నిర్ణయం వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి లోకవుతున్నారని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా

మేధావులను చట్టసభల్లోకి పంపాలి

నూజివీడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మేధావులను చట్టసభల్లోకి పంపాలని టీడీపీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అ న్నారు. నూజివీడు రోటరీక్లబ్‌లో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రాడ్యు యేట్ ఓటర్లతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో చింతలపూడి ప్రాజెక్టు పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరుస్తామ న్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఐదు ప్రధాన అంశాల పై సంతకాలు చేసి వాటిని పూర్తి స్థాయిలో అమలు పరుస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యా, ఉద్యోగ కల్పనే లక్ష్యం: మంత్రి సారథి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకు వచ్చి యువతకు బంగారు భవిష్యత్ తీసుకువచ్చే దిశగా రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెగా జాబ్ మేళాను ఆయన జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీతో కలిసి ప్రారంభించి మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనకు సీఎం చంద్రబాబు ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి యువతకు అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కల్పిస్తామని ఆయన తెలిపారు. ఎన్టీపీసీ సంస్థ 1.87 లక్షల కోట్లతో సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి యూనిట్‌ను స్థాపిం చనున్నదని దీని ద్వారా 1.06 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గూగల్ సంస్థలో సంప్రదించి రాష్ట్రంలో యూనిట్ నెలకొల్పేలా చర్య లు తీసుకున్నారని, వేల కోట్లతో రాష్ట్రంలో ఆ యూనిట్ స్థాపనకు ముందడుగు పడుతుంద న్నారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జితేంద్రకుమార్ పాల్గొన్నారు.

రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రికి వచ్చే ఏ ఒక్క రోగి ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ బాధ్యతలను శుక్రవారం ఆయన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉంద న్నారు. ఆసుపత్రి నూతన భవనాన్ని జనవరి 7న వైద్య ఆరోగ్య శాఖమంత్రితో కలిసి ప్రారంభి ంచనున్నట్లు ఆయన తెలిపారు. ఏరియా ఆసు పత్రి సభ్యునిగా ఇళయరాజా, ఎం.వెంకట కామే ష్, డాక్టర్ జాన్సిరాణి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, నాదెండ్ల శ్రీకాంత్, గొల్లు దుర్గాదేవి, మెంబర్ కన్వీనర్‌గా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర సింగ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు.


కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా నూజివీడు సబ్‌కలెక్టర్

సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ బాధ్యతల స్వీకరణ

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్‌కలెక్టర్‌గా బచ్చు స్మరణ్‌రాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సివిల్స్‌లో 676 ర్యాంక్ విజే త అయిన ఆయన 2022 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన వారు. చెన్నై ఐఐటీలో కెమి కల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన నూజివీడు సబ్ కలెక్టర్‌గా వచ్చారు. అనం తరం నూజివీడు పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిలను ట్రిపుల్ ఐటీలో ఆయన మర్యాద పూర్వ కంగా కలిశారు.

రైతులు పంటల బీమా చేయించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌బాషా

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): పంటల బీమా గడువును డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించిన నేపథ్యంలో ప్రతి రైతు పంటల బీమా ప్రీమియంను చెల్లించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌భాషా ఆదేశించారు. నూజివీడు వ్యవసాయశాఖ ఏ.డి కార్యాలయంలో నూజివీ డు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండ లాల వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం గ్రామసహాయకు లతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, మిను ము, పెసర, వరి, పంటలకు డిసెంబ ర్ 31వ తేదీ వరకు పంటల బీమాను పొడిగించ టం జరిగిందని, ఈ అవకా శాన్ని రైతులు సద్వినియోగం చేసుకు నేలా కృషి చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకం ఈకేవైసీ కాని రైతులు అందరూ దగ్గర్లో ఉన్న సీఎస్‌సీ, ఆర్.ఎస్.కె కేంద్రాలకు వెళ్ళి ఈకేవైసీ పూర్తి చేసుకుని లబ్ధిందాలని సూచిం చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచా లకులు జి.విద్యాసాగర్, వ్యవసాయశాఖ అధికా రులు చాముండేశ్వరి, చెన్నారావు, శివశ ంకర్, సూరిబాబు, మధుమోహన్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ముసునూరు, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని క్లస్టర్ ఇన్‌చార్జ్ గార్లపాటి నరసింహరావు అన్నారు. శుక్రవారం ముసునూరు బీసీ, ఎస్సీకాలనీల్లో ఆయన టీడీపీ సభ్యత్వ నమోదు చేశారు. సుమారు 150 మంది సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటివరకు 1620 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు నరసింహరావు తెలిపారు.

అర్జీల స్వీకరణ

చాట్రాయి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ప్రశాంతి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంతు సత్యనారాయణ, పేటేటి జెనర్జీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: సూరేపల్లిలో జరిగిన గ్రామసభలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమ శర్మ అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామసభలో వివిధ సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధారాణి, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారయణ, ఆర్ఐ దీపిక, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం నిరసన

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి):విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నూజివీడు మం డలం తుక్కులూరులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులపై మోపిన భారాన్ని తక్షణం రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు జోజి, బాబురావు, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బుసక అక్రమ రవాణా చేస్తే లారీలు సీజ్

ఎమ్మెల్యే కామినేని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బుసక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుం టున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో శుక్ర వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బుసక రవాణా ట్రాక్టర్ల ద్వారానే జరగాలని భారీ వాహ నాలను, టిప్పర్లను వినియోగిస్తే సీజ్ చేస్తామ న్నారు. 165వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కైకలూరుకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోందని వాటికి మినహా మిగిలిన రవాణా ను అడ్డుకుంటున్నట్టు తెలిపారు. అన్నిచోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కైకలూ రులో రోడ్లపై సం చరిస్తున్న గోవులను వాటి యజమానులు తీసుకె ళ్లాలని లేకుంటే గోశాలకు తరలిస్తామన్నారు. రూరల్ సీఐ రవికుమార్, ఎస్సైలు రాంబాబు, రామచంద్రరావు, వెంకటేశ్వర రావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భూ సమస్యలను గ్రామసదస్సులో ఫిర్యాదు చేస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. భుజబల పట్నంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర చేపల రైతు ల సంఘం మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతా రామరాజు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, సర్పంచ్ గురజాల రామతులసి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, గ్రామ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చేపట్టండి

నూజివీడు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పవని మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.కనకమహాలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటలు పూ మొగ్గ, పచ్చి పూత దశలో ఉన్నాయన్నారు. అల్పపీడనం వల్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికం అయ్యే అవకాశం ఉందని పూ మొగ్గ దశలో ఉన్న తోటల్లో తేనేమంచు, పక్షి కన్ను, బూడిద తెగుళ్ల నివారణకు ఇమిడి క్లోప్రిడ్ 0.3 ఎమ్ఎల్, క్లోరోథలోనిల్ 2 ఎమ్ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పచ్చి పూత దశలో ఉంటే థైయోమిథాక్సిన్ 0.3 గ్రాములు లేదా కార్బండిజం మ్యాంకో జబ్ 2 గ్రాములు నీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తోటలకు నీరు అందించడం నిలిపివేయాలని ఆమె సూచించారు.



పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత

చాట్రాయి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న యర్రా విజయనిర్మల కుమార్తె మౌనిక వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేల విలువైన బంగారు నాణాన్ని శుక్రవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు పెండ్లి కుమార్తెకు అందజే శారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మందలపు పద్మావతి, సూపర్‌వైజర్ శివ నాగే శ్వరరావు, వేతన కార్యదర్శి సత్యనారాయణ పాడి రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

నూజివీడు టౌన్, డిసెంబర్ 20 (ఆంధ్ర జ్యోతి): వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నర్సుపేట గ్రామానికి చెందిన శెట్టిపల్లి రాఘవులుకు గ్రామంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. అందులోని మామిడిచెట్లను నరికేందుకు ఉపక్రమించగా అది అటవీభూమి అంటూ అడ్డుచెప్పడంతో రాఘవులు అనుమతుల కోసం రూ.50వేలు చెల్లించారని, అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోవడంతో విరక్తిచెంది తన తోటలోకి వెళ్ళి పురుగుమందు తాగడంతో వృద్ధుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో రాఘవులను గమనించిన స్థానికులు నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యసేవలను అందిస్తున్నారు.


ఎక్స్‌కవేటర్‌తో డ్రెయినేజీ పూడికతీత

'స్వచ్ఛ మట్టగుంట లక్ష్యం'

కలిదిండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ మట్టగుంట' తమ లక్ష్యమని సర్పంచ్ అండ్రాజు రత్నమణి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అండ్రాజు దుర్గారావు అన్నారు. గ్రామంలో శుక్రవారం డ్రెయినేజీల్లో పూడిక ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి బ్లీచింగ్ చల్లా రు. అంతర్గత రహదారులపై పేరుకున్న చెత్తకుప్పలను, బురదను తొలగించారు. పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

ముదినేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): పెదగొన్నూరులోని గంగానమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం జరిగింది. అమ్మవారికి భక్తు లు పూజలు జరిపిన అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మహిళలు, బాలికలు చంద నపు నీళ్లతో వసంతోత్సవం నిర్వహించారు. అంతకు ముందు గంగానమ్మ, పోతురాజుల చలువ కుండల ఊరేగింపు నిర్వహించారు. శనివారం జాతర మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరితగతిన భూ సమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్యే

కలిదిండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధి కారులను ఆదేశించారు. కలిదిండిలో శుక్ర వారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, సర్పంచ్ మారు తి ప్రసన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, నాగరాజు, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం..

ముదినేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యో తి): భూ సమస్యలకు సంబంధించి రైతులు అందజేస్తున్న ప్రతీ అర్జీని పరిష్కరి స్తామని మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాస్ తెలి పారు. చినపాలపర్రులో శుక్రవారం నిర్వ హించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు సబ్ డివిజన్లు, సర్వేలకు సంబం ధించి వినతిపత్రాలను అందజేశారు. భూ ముల రికార్డులను పకడ్బందీగా నిర్వహించ నున్నట్టు తహసీల్దార్ సుభానీ తెలిపారు. సర్పంచ్ మొవ్వ జయలక్ష్మి, వీఆర్వో కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సెమీ క్రిస్మస్

ముదినేపల్లి/మండవల్లి/కలిదిండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాలతో జరిగాయి. గాడ్స్ లవ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో స్థానిక బెతెస్తా పెంతెకోస్తు చర్చి ఫాదర్ రెవరెండ్ కటికల ప్రభుదాసు నిర్వహిం చిన ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో గుడివాడ, ఉనికిలి చర్చిల ఫాదర్లు జోసఫ్ తరుణ్, ప్రభు చరణ్ పాల్గొని క్రీస్తు సందేశాలను పేర్కొన్నారు.


ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీలో సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఫాస్టర్లు


కలిదిండిలోని ఆర్‌సీఎం చర్చి

బాలబాలికలు నిర్వహించిన క్రిస్మస్ నృత్యాలు అలరించాయి.

మండవల్లి ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగినాయి.


మండవల్లిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

భైరవపట్నం విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ సంకర్ల శాంతిరాజు, రెవరెండ్ ఫాదర్ ప్రదీప్ సెమీక్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ముఖ్య అతిథులుగా ఎన్డీయే పార్టీ నాయకులు గుడివాడ చిట్టిబాబు, ముళ్ళపూడి సత్తిబాబు, సంఘ పెద్దలు మొండ సురేష్‌బాబు, బొద్దురి ఏసు దాసు, సంఘస్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలిదిండిలో క్రిస్మస్ పురస్కరించుకుని ఆర్‌సీఎం చర్చిని, కల్వరి కొండను విద్యుద్దీపా లతో అలంకరించారు. ఇళ్లపై క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. భాస్కరావుపేట, గుర్వాయి పాలెం చర్చిలు విద్యుద్దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి.


గంజాయి విక్రేతలను చూపుతున్న పోలీసులు

గంజాయి విక్రేతల అరెస్టు

కలిదిండి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో 22 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ రవికుమార్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కలిదిండికి చెందిన ఎస్‌కె.జిలాని (24), ఎండి.అల్తాఫ్ (27), ఎండి.అమీర్ బాషా (21), బోయిన నీలసాయి (24)లను కలిదిండి మార్కెట్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించామని సీఐ, ఎస్ఐ తెలిపారు.

చేలో పంట చేతికి దక్కేనా..?

వర్షాలతో రైతుల బెంబేలు
పంటనష్టం తప్పదంటూ ఆవేదన

ముదినేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): వాయుగుండాలు, అల్పపీడనాలు రైతుల నడ్డి విరుస్తున్నాయి. ఒడ్డుకు చేర్చి న ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతుండగా, ఇంకా కోతలు కోయని వరి పైరు చేతికి దక్కుతుందా.. లేదా..? అన్నది మరో పక్క వేధిస్తోంది. పసిరి తగ్గని పైరు కూడాగాలులకు నేల మట్టమయింది. వర్షాలతో కోతలకు అవ కాశం లేని పరిస్థితి ఏర్పడింది. సుమారు 3 వేల ఎకరాల్లోని వరి పైరు చేలల్లోనే ఉండిపోయింది. ఈ పరిస్థితుల్లో నేలకొరి గిన వరి పైరును దక్కించుకోవడం ఎలా అన్నది రైతులకు ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు ఎక్కువైతే వరి పైరు పొలాల్లోనే కుళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.

రైతులకు తీవ్ర నష్టం



ఈ సార్వా సీజన్‌లో వర్షాల కారణంగా రైతు లు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపో యారు. డ్రెయిన్ల తవ్వకాలు లేక తొలుత ముంపు ఏర్పడగా, ఇప్పుడు చేతికి దక్కనున్న పంట వర్షాలకు దెబ్బతింటోంది.

- ఉల్లంకి కోదండ రామయ్య, రైతు, దేవపూడి